ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

ఆదివారం 21 సెప్టెంబరు 2025



చీపురు పట్టి శుభ్రం చేస్తున్న సీఎం చంద్రబాబు



యాదవుల బజారు వాసులతో మాట్లాడుతున్న సీఎం



స్వచ్ఛరథాలను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు



స్వచ్ఛరథాలను పరిశీలిస్తూ..



స్టాల్‌లో రైతుతో మాట్లాడుతూ

"చెడు చేయడానికి ఒక నిమిషం చాలు. మంచి చేయాలంటే చాలా సమయం పడుతుంది. నా శేష జీవితం పేదలకే అంకితం. సంక్షేమ పథకాలను ఒక బాధ్యతగా ఇస్తున్నాను. నిరుపేదలను ఆదుకునేందుకు సూపర్ సిక్స్ తీసుకువచ్చాను. పేదల సమస్యల పరిష్కారం కోసం.. వారు ఆర్థిక ఎదుగుదల కోసమే పీ-4ను అమలు చేస్తున్నాను.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు బంగారు కుటుంబాల కార్యక్రమంపై తన ఆలోచన విధానాన్ని స్పష్టం చేశారు."



ఆప్యాయంగా పలకరింపు..



మాచర్లకు స్వాతంత్ర్యం వచ్చింది

చాలా కాలం తర్వాత మాచర్లకు స్వాతంత్ర్యం వచ్చిందని, ఈ ఆనందం అందరి ముఖాల్లో కనిపిస్తోందని.. ఇది శాశ్వతంగా ఉండాలని తాను కోరుకుంటున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మాచర్లలో శనివారం జరిగిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఇక్కడ మళ్లీ టీడీపీ జెండాను ఎగురవేశారని.. మాచర్ల వచ్చినపుడు అఖండ స్వాగతం పలికారని సంతోషం వ్యక్తం చేశారు. ఎక్కడో రాజీవ్ గాంధీ హత్య జరిగిన సందర్భంగా మాచర్లలో ఉండే రౌడీలు, ముఠా నాయకులు ఇక్కడి ప్రజల ఆస్తులను విధ్వంసం చేశారని గుర్తుచేసుకున్నారు. ఎన్నికల ముందు వరకు మాచర్లలో ప్రజాస్వామ్యం, ఎన్నికలు లేవన్న చంద్రబాబు నాయుడు.. చరిత్రలో డిక్టేటర్లకు పట్టిన గతే ఇక్కడి నేతలకు పట్టింద న్నారు. ఇకనైనా ఆ నేతలు పద్ధతులు మార్చుకోకపోతే వారిని ప్రజాస్వామ్యం క్షమించదని తీవ్రంగా హెచ్చరించారు.



- ప్రతి ఒక్కరి ముఖాల్లో ఆ ఆనందం స్పష్టంగా కనిపిస్తోంది
- చాలా కాలం తర్వాత ఇక్కడ టీడీపీ జెండా ఎగుర వేశారు
- చెత్త క్లీన్ చేసినట్లే.. చెత్త రాజకీయాలను క్లీన్ చేస్తా..
- గత ఐదేళ్లలో నాలాంటి నాయకుడే మాచర్లకు రాలేకపోయారు..
- ఇప్పుడు అందరూ స్వేచ్ఛగా వస్తున్నారు..
- స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

మాచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ప్రాంతంలోని ఆత్మకూరు గ్రామానికి చెందిన వారిని గ్రామం నుంచి వెళ్లగొట్టారు. వారిని ఆత్మకూరుకు తీసుకొస్తుంటే నన్ను అడ్డుకున్నారు. నా నివాసానికే తాళ్లు కట్టారు. ఆ తాళ్లే వారికి ఉరితాళ్లుగా మారాయి. గతంలో ఇక్కడ చాలానే అరాచకాలు జరిగాయి. మాచర్ల మునిసిపల్ ఎన్నికల్లో పార్టీ నేతలపై దాడి చేశారు. అందుకే నేను చెబుతున్నాను రాయలసీమలో ముఠాలు లేకుండా చేశాను. పల్నాడులో ఖబడ్దార్ జాగ్రత్తగా ఉండండి (మిగతా 8వ పేజీలో)





దత్తత తీసుకున్న కుటుంబాలతో సీఎం చంద్రబాబు, మార్గదర్శకులు

రెండు బంగారు కుటుంబాలు దత్తత

- ముందుకు వచ్చిన మార్గదర్శకులు
- పిల్లలను చదివించాలని సీఎం సూచన

మాచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మాచర్లలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర సభ పేద కుటుంబాలను ఆదుకునేందుకు వేదికైంది. సీఎం చంద్రబాబు నాయుడి సమక్షంలో రెండు బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకున్నారు. ఆ కుటుంబాల ఆర్థిక పురోగతికి ప్రణాళికలు రూపొందించాలని చంద్రబాబు మార్గదర్శకులకు సూచించారు. మాచర్ల పట్టణంలోని 11వ వార్డుకు చెందిన బత్తుల నీలావతిని బంగారు కుటుంబంగా ఎంపిక చేశారు. ఆమె పడుతున్న ఇబ్బందులను చంద్రబాబు సమక్షంలో తెలియజేసింది. తల్లిదండ్రులు చిన్న వయస్సులో పెళ్లి చేశారని.. తన భర్త మరణించాడని, ముగ్గురు మగ పిల్లల పోషణకు కూలీ పనులకు వెళ్తున్నట్లు గోడు వెళ్లబోసుకుంది. ముగ్గురు పిల్లలకీ 'తల్లికి వందనం' లబ్ధి చేకూరిందని చెప్పింది. తన తల్లిదండ్రులు కూడా కూలికి వెళ్తుంటారని, అత్త మామలు కూడా సహకరించడం లేదని బాధపడింది. వితంతు పింఛను (మిగతా 8వ పేజీలో)



వివిధ సంఘాలకు చెక్కు అందజేస్తూ..



వైద్యులతో మాట్లాడుతూ..

బీచ్ ఫెస్టివల్‌ను జయప్రదం చేయాలి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



బాపట్ల, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): సూర్యలంకలో బీచ్ ఫెస్టివల్‌ను జయప్రదంగా నిర్వహించడానికి అధికారులంతా సమగ్ర ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ వి. వినోద్‌కుమార్ ఆదేశించారు. బీచ్ ఫెస్టివల్ నిర్వహణపై అధికారులతో శనివారం రాత్రి కలెక్టరేట్ నుంచి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయేలా వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించాలన్నారు. తీరంలో కిలోమీటరు పొడవున 30 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాట్లు చేయాలన్నారు. పర్యాటకులకు కనువిందు చేసేలా లేజర్‌షో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నదని తెలిపారు. 80 ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. తొలిరోజు 2 లక్షల మంది పర్యాటకులు హాజరయ్యేలా, వారి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పేరలి కెనాల్ నుంచి నూతనంగా మరో మార్గాన్ని ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, పర్యాటకశాఖాధికారి నాగిరెడ్డి, ఉపకలెక్టర్ సాయిబాబా, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు పాల్గొన్నారు.

బాపట్లలో భారీ వర్షం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్లలో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలో పలు రహదారులు తటాకాలను తలపించాయి. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి బాపట్ల, చీరాల, అద్దంకి పట్టణాల్లోని వీధులన్నీ జలమయమయ్యాయి. శనివారం సాయంత్రం కూడా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. శుక్ర, శనివారాలలో మధ్యాహ్నం పూట భానుడు ప్రకోపం చూపగా సాయంత్రం భారీ వర్షం నమోదైంది. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు వరద ముంచెత్తి వరి పైరుకు నష్టం వాటిల్లింది. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలు పైర్లకు మేలు జరిగేదేనని రైతులు చెప్తున్నారు. గడచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 21.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా చుండూరు మండలంలో 78.6 మి.మీ. వాన కురిసింది. బల్లికురవ మండలంలో 67.2, జె.పంగులూరు మండలంలో 53.2, బాపట్ల 42.6, కర్లపాలెం మండలంలో 49.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



పాత బస్టాండ్ వద్ద వర్షపు నీరు

వైద్య కళాశాలను త్వరలో నిర్మిస్తాం

- నాడు ఏమీచేయక.. ఇప్పుడు విమర్శలా?
- మూడేళ్లలో అని పునాదులతో సరిపెట్టారని ధ్వజం

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాపట్ల వైద్య కళాశాల నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేసి ప్రజల మనసులు గెలుస్తామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. స్థానిక జమ్ములపాలెంరోడ్డులో వైసీపీ హయాంలో పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసిన కళాశాలను శనివారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం పీపీపీ విధానంలో కళాశాలను త్వరితగతిన నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. తన వల్లే జిల్లా, వైద్య కళాశాలలు వచ్చాయని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పుకుంటున్నారే కానీ చేసింది శూన్యమన్నారు. 2021లో శంకుస్థాపన సమయంలో మూడేళ్లల్లో పూర్తి చేసి 100 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తామని ప్రగల్భాలు పలికారని కానీ ఇప్పటికే కళాశాల పునాదులనూ అంతంతమాత్రంగా నిర్మించారన్నారు. 2024 వరకు అధికారంలో ఉన్నవారు ఏమీ చేయలేక ఇప్పుడు జెండాలు పట్టుకుని వైద్య కళాశాల అంటూ రావడం, విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. తొలుత నాబార్డు రూ.252 కోట్లు మంజూరు చేయగా రూ.65 కోట్లు పనులు చేస్తే కేవలం రూ.20 కోట్లు మాత్రమే కాంట్రాక్టర్‌కు గత పాలకులు చెల్లించారన్నారు. మిగిలిన డబ్బులు ఏమి చేశారని వేగేశన ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖరబాబు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, పట్టణ, మండల టీడీపీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, బీజేపీ నాయకులు కొత్రా వెంకటరామకృష్ణ, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, చెన్నుపాటి కిశోర్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రావిపూడి నాగమల్లేశ్వరరావు, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని, కూచిపూడి శ్యామ్ సుందర్, మాడా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల పిల్లర్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, కూటమి నేతలు

చీరాలలో.. స్వయంభు సందడి

చిత్ర యూనిట్‌కు ఎమ్మెల్యే కొండయ్య అభినందనలు

చీరాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చీరాల - వాడరేవు రోడ్డులోని నగరవనం అటవీ ప్రాంతంలో స్వయంభు చిత్రం షూటింగ్ జరుగుతోంది. నిఖిల్ కథానాయకుడిగా చిత్రం క్లైమాక్స్‌కు సంబంధించి ఆధ్యాత్మిక సన్నివేశాలు మూడు రోజులుగా చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే కొండయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్, యువనాయకులు గౌరీ అమర్నాథ్‌తో కలిసి షూటింగ్ స్పాట్‌కు చేరుకుని చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చీరాల వైపు తెలుగు చలనచిత్ర సీమ దృష్టి సారించాలన్నారు. చీరాల పరిసర ప్రాంతాల్లో సినిమాల చిత్రీకరణలకు అన్ని హంగులు ఉన్నట్లు చెప్పారు.



నిఖిల్ చిత్ర యూనిట్‌ను కలిసిన ఎమ్మెల్యే కొండయ్య

చెక్‌పోస్టులకు రంగం సిద్ధం

- వచ్చే నెల 1 నుంచి గ్రానైట్ సీనరేజ్ వసూళ్లు
- ఉమ్మడి జిల్లా పరిధిలో ఏఎంఆర్ కంపెనీకే బాధ్యత

బల్లికురవ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వ ఖజనాకు ఆదాయం వచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో బాగంగా గ్రానైట్ సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ఏఎంఆర్ కంపెనీకి అప్పగించింది. గత నెలలో జరిగిన టెండర్లలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి రూ.47.29 కోట్లు చెల్లించేలా ఏఎంఆర్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో అద్దంకి, పర్చూరు, చీరాల నియెజకవర్గాల పరిధిలోని పలు మండలాల సరిహద్దులో సుమారు 54 ప్రైవేట్ చెక్‌పోస్టుల ఏర్పాటుకు సంబంధిత కంపెనీ నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ చెక్‌పోస్టులతో అక్రమంగా తరలిస్తున్న ఖనిజ సంపదకు ఫుల్‌స్టాప్ పడుతుందని అధికారులు అంటున్నారు. బల్లికురవ మండలంలోని వీర్లకొండ సమీపంలో, గ్రానైట్ ఫ్యాక్టరీల ప్రాంతాల్లో చెక్‌పోస్టుల కంటైనర్లను ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా పరిధిలో ఏఎంఆర్ కంపెనీ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సీనరేజ్ వసూళ్లు చేస్తోంది. ప్రభుత్వానికి ఈ కంపెనీ ద్వారా ఆదాయం వస్తుండటంతో ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ఆ కంపెనీకే ప్రభుత్వం అప్పగించింది. ఇక నుంచి అక్రమ మార్గంలో గ్రానైట్ ఖనిజ సంపదకు తరలింపునకు అవకాశం ఉండదని, తప్పనిసరిగా సీనరేజ్ కట్టాల్సి వస్తుందని గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీల యజమానుల్లో ఇప్పటి నుంచే ఆందోళన మొదలైంది. పొలాలకు తాము మట్టిని తోలుకోవాలంటే ఇక నుంచి ఇబ్బందేనని రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు.



చెక్ పోస్టు ఏర్పాటుకు దించిన కంటైనర్

కాఫీ విత్.. క్లాప్ మిత్ర

- కార్మికుల యోగక్షేమాలు తెలుసుకున్న కలెక్టర్, ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆత్మీయ పలకరింపులతో పారిశుద్ధ్య కార్మికులు పరవశించారు. ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటూ, కుటుంబ బాగోగులపై ఆరా తీసి.. విధి నిర్వహణలో ఎలాంటి సమస్య, ఇబ్బందులు ఎదురైనా అండగా ఉంటామని, ఆరోగ్య భద్రత తమదే అంటూ వారిలో భరోసా నింపారు. క్లాప్ మిత్రలతో కలసి కాఫీ తాగుతూ అందరూ ఒక్కటే అన్న భావనను వారిలో కల్పించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే ఏలూరితో కలసి కలెక్టర్ పర్చూరులో పర్యటించారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సేవలను కలెక్టర్ కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరితో కలిసి కార్మికులను సన్మానించి, వారితో ప్రత్యేకంగా ముచ్చటించారు. పారిశుధ్య కార్మికులకు త్వరలో వైద్య శిబిరాలను నిర్వహించి మందులు, మెరుగైన చికిత్సలను ఉచితంగా అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.



క్లాప్ మిత్రలతో కాఫీ తాగుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే ఏలూరి

'గ్రూప్-1' అవకతవకలపై సీబీఐతో విచారణ జరపాలి

● ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకుడు మహంకాళి సుబ్బారావు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో అవకతవలకు పాల్పడిన వారిపై సీబీఐతో విచారణ చేయించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకుడు మహంకాళి సుబ్బారావు శనివారం డిమాండ్ చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష జవాబు పత్రాలను ఆనాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు ఏక పక్షంగా థర్డ్ పార్టీకి ఇచ్చి డిజిటల్ మూల్యాంకనం చేయించారని ఆరోపించారు. నోటిఫికేషన్‌లో డిజిటల్ మూల్యాంకన పద్ధతి గురించి పొందుపరచ లేదు కాబట్టే పాత పద్ధతిలోనే మ్యాన్యువల్ మూల్యాంకనం చేయించాలని హైకోర్టుకి వెళ్లామని చెప్పారు. కోర్టు మ్యానువల్ పద్ధతిలోనే మూల్యాంకనం చేయాలని సూచించినట్లు తెలిపారు. అయితే మాన్యువల్ మూల్యాంకనాన్ని ప్రైవేట్ ప్రాపర్టీ అయిన హాయ్ ల్యాండ్‌లో చేశారని, ఏపీపీఎస్సీ ఛైర్మన్, సభ్యులు కలిసి వారికి అనుకూలమైన అభ్యర్థులకు మార్కులు వేసుకొని నియమించుకున్నారని ఆరోపించారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షా ఫలితాలలో తప్పులు జరిగాయని అన్నారు. వీటిపైన సీబీఐతో విచారణ చేయించాలని చంద్రబాబును కోరామని, కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు దాటినా తమ నిర్ణయాన్ని చెప్పకుండా దాటవేస్తోందని ఆరోపించారు.

రైల్వే ఉద్యోగుల ఆరోగ్యమే మాకు ప్రాధాన్యం

● రైల్వే ప్రజా సంబంధాల అధికారి వినయ్‌కాంత్



గుంటూరు-దొనకొండ సెక్షన్‌లోని రైల్వే ఉద్యోగులకు హెల్త్ ఆన్ వీల్స్ రైలులో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుంటూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు గుంటూరు డివిజన్ ప్రజా సంబంధాల అధికారి డీ వినయ్‌కాంత్ అన్నారు. శనివారం గుంటూరు-దొనకొండ సెక్షన్‌లో రైల్వే ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు హెల్త్ ఆన్ వీల్స్ రైలుని నడిపారు. మార్గమధ్యలోని అన్ని స్టేషన్లలో ఈ రైలుని నిలిపి అక్కడి సిబ్బందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. మొత్తం 140 మంది రైల్వే ఉద్యోగులు వారి కుటుంబసభ్యులతో ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నారు. గుండె, కంటి, క్యాన్సర్ తదితర స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ముందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీఎంఎస్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, డీఎంవోలు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ప్రకాశ్ పాల్గొన్నారు.

కష్టపడే వారికి టీడీపీ అండగా ఉంటుంది

● డీఎస్ఆర్ సన్మాన కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని



డీఎస్ఆర్ దంపతులను సన్మానిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్సీ ఆలపాటి, ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, మాధవి, నసీర్ అహ్మద్, మేయర్ నాని తదితరులు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నీతి నిజాయితీలతో కష్టపడే వారిని కూటమి ప్రభుత్వం ఎప్పుడూ గుర్తిస్తుందని కేంద్ర మంత్రి పెమ్మసాని అన్నారు. రెరా సభ్యుడిగా నియమితులైన దామచర్ల శ్రీనివాసరావు (డీఎస్ఆర్)కు శనివారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ, డీఎస్ఆర్ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుంటారని, ఆయన రెరా పదవికి అన్ని విధాలా అర్హులని పేర్కొన్నారు. అనంతరం చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ, డీఎస్ఆర్ ఫ్రెండ్స్ సర్కిల్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ, డీఎస్ఆర్ తనకెంతో ఆప్త మిత్రుడని తెలిపారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ, పార్టీలో సుదీర్ఘకాలంగా కష్టపడి పనిచేసిన డీఎస్ఆర్ సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఈ పదవి ఇచ్చిందని అన్నారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ, పార్టీలో అందరికీ సుపరిచితుడైన డీఎస్ఆర్ సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, రెరా సభ్యుడిగా డీఎస్ఆర్ ఆ పదవికి వన్నెతెస్తారన్నారు. నగర మేయర్ కోవెలముడి రవీంద్ర మాట్లాడుతూ, పట్టుదల, కృషి డీఎస్ఆర్‌కు ఎంతో గుర్తింపు తెచ్చాయన్నారు. పార్టీలో అందర్నీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతుంటారని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని డీఎస్ఆర్ తెలిపారు. పార్టీ అధినేత చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్‌కు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం డీఎస్ఆర్ దంపతులను మెమెంటో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, రాష్ట్ర టీడీపీ నాయకులు మన్నవ మోహన్ కృష్ణ, డేగల ప్రభాకర్, బుచ్చి రాంప్రసాద్, మల్లే ఈశ్వర రావు, ఛైర్మన్ శివారెడ్డి, సభ్యులు వెంకటరత్నం, కులదీప్, నిమ్మల శేషయ్య, తాళ్ల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

● ఏపీ ఈగల్ టీమ్ ఐజీ ఆకే రవికృష్ణ



ప్రతిజ్ఞ చేస్తున్న ఐజీ రవికృష్ణ

గుంటూరు(విద్య),సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని ఏపీ ఈగల్ టీమ్ ఐజీ ఆకే రవికృష్ణ విజ్ఞప్తి చేశారు.మాదక ద్రవ్యాలు వాడితే పరోక్షంగా తీవ్రవాదాన్ని ప్రోత్సాహించినట్లేనని ఆయన పేర్కొన్నారు. చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం యాంటీ డ్రగ్స్, ర్యాగింగ్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రవికృష్ణ డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో విద్యార్థులతో ప్రమాణం చేయించారు. అనంతరం మాట్లాడుతూ ఎంతో భవిష్యత్తు ఉన్న యువత డ్రగ్స్ వలలో చిక్కి జీవితాల్ని, వారి కుటుంబాల్ని నాశనం చేసుకోవద్దని కోరారు. డ్రగ్స్ వాడినా, వాటిని రవాణా చేసినా 5 నుంచి 10 ఏళ్ల పాటు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇలా రాష్ట్రంలో వేల మంది శిక్షలు అనుభవిస్తున్నారని, వీరిలో అత్యధికులు చదుకున్న యువతే కావడం ఆందోళనకరమని పేర్కొన్నారు. దేశాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని రవికృష్ణ కోరారు. అనంతరం డీఎస్పీ జి.భానోదయ ప్రసంగిస్తూ, కళాశాలల్లో సేఫ్ క్యాంపస్, యాంటి ర్యాగింగ్ క్లబ్‌లకు యాజమాన్యాలు ప్రాధాన్యమివ్వాలని అన్నారు. యువత ఒత్తిడిని అధిగమించేందుకు యోగా, ధ్యానం, వ్యాయామం, క్రీడలవైపు దృష్టి సారించాలని కోరారు. అనంతరం అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎమ్.జగదీశ్వరి మాట్లాడుతూ, విద్యార్థులు డ్రగ్స్, ర్యాగింగ్, సైబర్ నేరాల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఓ వ్యక్తి మనోభావాలను దెబ్బతీసే ఎటువంటి చర్యలైనా ర్యాగింగ్ కిందకే వస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రామనాథం శ్రీనివాసరావు (ఫైల్)

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫణిదం గ్రామంలో ఈ నెల 17వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన రామనాథం శ్రీనివాసరావు (54) చికిత్స పొందుతూ మృతి చెందారు. సత్తెనపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించటంతో శుక్రవారం గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఆయన బంధువులు శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన దాసరి వెంకటేశ్వర్లుకు, శ్రీనివాసరావు అప్పు ఇచ్చారు. ఆ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగటంతో దాసరి వెంకటేశ్వర్లు పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించటంతో అతనికి ఏమైనా అవుతుందేమోననే భయంతో శ్రీనివాసరావు గడ్డి మందు తాగారు. ఈ విషయాన్ని భార్యా, పిల్లలకు చెప్పటంతో వారు కూడా మనస్థాపం చెంది.. ఈ నెల 17వ తేదీన బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

గుండె పోటుతో ప్రధానోపాధ్యాయుడి మృతి



రామకృష్ణ (ఫైల్)

దాచేపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొల్లూరు రామకృష్ణ (61) గుండె పోటుతో మృతి చెందారు. రామకృష్ణ స్వస్థలం తెనాలి. ఆయన అమర్తలూరు మండలం పెరవల్లి హైస్కూల్‌లో పనిచేస్తూ.. ఈ ఏడాది జూన్‌లో బదిలీపై కేసానుపల్లి ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంగా వచ్చారు. పాఠశాలకు వచ్చిన నాలుగు నెలల్లోనే అందరితో కలివిడిగా ఉంటున్న రామకృష్ణ శుక్రవారం కూడా దాచేపల్లిలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన హఠాత్తుగా మృతి చెందటంతో ఉపాధ్యాయ సంఘ నాయకులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. రామకృష్ణ కుటుంబం తెనాలిలోనే నివాసం ఉంటోంది.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి



గాజుల వీరాంజనేయులు (ఫైల్)

దాచేపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మిరప చేనుకు పురుగుల మందు కొట్టేందుకు వెళ్లిన ఓ వ్యవసాయ కూలీ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన దాచేపల్లి మండలం మాదినపాడులో శనివారం జరిగింది. మాదినపాడుకు చెందిన గాజుల వీరాంజనేయులు (37) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. శనివారం గ్రామంలోని ఓ మిరప చేనుకు పురుగుల మందు కొట్టేందుకు వెళ్లిన అతడు నీరు పట్టుకునేందుకు మోటారు ఆన్ చేస్తుండగా షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు.

మాదినపాడు బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

దాచేపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాదినపాడు రిజర్వ్ ఫారెస్టు బీట్ ఆఫీసర్ బిళ్ళల వెంకటేశ్వర్లుపై సస్పెన్షన్ వేటు పడింది. మాదినపాడు రిజర్వ్ ఫారెస్టులో జరుగుతున్న అకృత్యాలపై విచారణ జరిపిన మండల అధికారులు జిల్లా అటవీ అధికారులకు నివేదిక అందజేశారు. దీని ఆధారంగా జిల్లా అధికారులు వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఒంటెద్దు వాహనాన్ని ఢీకొన్న బైక్

● ప్రమాదంలో తండ్రీకుమార్తె మృతి

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న ఒంటెద్దు వాహనాన్ని బైక్ ఢీకొనడంతో తండ్రీ కుమార్తె మృతి చెందగా, తల్లీ ఆరు నెలల పసికందుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం శనివారం భట్టిప్రోలు మండలం కన్నెగంటివారిపాలెం- గొరికపూడి గ్రామాల మధ్యన జరిగింది. రేపల్లె పట్టణానికి చెందిన చొక్కాకుల నాగసాయి (27) మునిసిపాలిటీలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం భార్యా, పిల్లలను తీసుకొని ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో ఉన్న అత్తగారింటికి తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో ముందు వెళుతున్న ఒంటెద్దు బండిని అతని ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో నాగసాయి, పెద్ద కుమార్తె పల్లవి (2) అక్కడికక్కడే మృతి చెందగా.. అతని భార్య రాజేశ్వరి, ఆరు నెలల పసికందు వేదశ్రీకి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని స్థానికులు చికిత్స నిమిత్తం రేపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివయ్య చెప్పారు. మృతి చెందిన నాగసాయిని, అతని పెద్ద కుమార్తెను పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

టెయిల్‌పాండ్ నుంచి 1,97,431 క్యూసెక్కుల నీటి విడుదల

రెంటచింతల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సత్రశాల నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి 13 గేట్లను 3 మీటర్ల మేర ఎత్తి 1,97,431 క్యూసెక్కుల నీటిని శనివారం పులిచింతలకు విడుదల చేశారు. టెయిల్‌పాండ్‌కు ఎగువన ఉన్న సాగర్ నుంచి అదే పరిమాణంలో నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం, గిరిబాబు తెలిపారు. రిజర్వాయర్‌లో 74.50 మీటర్ల మేర నీరుండగా ఇది 6.0350 టీఎంసీలకు సమానమని చెప్పారు. కాగా, విద్యుత్ ప్రాజెక్టులో విద్యుదుత్పత్తిని నిలిపివేసినట్లు వారు పేర్కొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 41.43 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, ఎనిమిది గేట్ల ద్వారా 1,89,250 క్యూసెక్కులు, మొత్తం 2,06,520 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఆయన చెప్పారు.

దసరా సెలవులివ్వడంతో

విద్యార్థుల ఇంటిబాట

● బస్టాండు, రైల్వే స్టేషన్లు కిటకిట



ఇంటిబాట పట్టిన విద్యార్థులు....

గుంటూరు, సెప్టెంబరు 20: ప్రభుత్వ పాఠశాలలకు, కళాశాలలకు ఈ నెల 22 నుంచి దసరా సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. శనివారం మధ్యాహ్నం నుంచే విద్యార్థుల తల్లిదండ్రులు నగరంలోని హాస్టల్స్ వద్దకు చేరుకుని విద్యార్థుల్ని ఇళ్లకు తీసుకెళ్లే పనిలో పడ్డారు. దీంతో నగరంలోని బస్టాండు, రైల్వేస్టేషన్ విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కిటకిటలాడాయి. నగరంలోని అనేక ప్రాంతాల్లో ఆటోలు, సిటీబస్సుల్లో సందడి వాతావరణం నెలకొంది. విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా ఉల్లాసంగా ఇంటిబాట పట్టారు.



ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండులో విద్యార్థుల కోలాహలం

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు : డీపీటీవో విమల



గుంటూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రయాణి కుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి సీహెచ్ విమల తెలిపారు. దసరాకు ప్రధానంగా జిల్లాకు వచ్చే ప్రయాణికుల కోసం గుంటూరు నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకు సర్వీసులు నడుపుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ముందుగా గుంటూరు నుంచి ఈ నెల 30, అక్టోబరు 1, 2వ తేదీల్లో హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు సర్వీసులు పంపుతున్నట్లు పేర్కొన్నారు. కాగా హైదరాబాద్‌కు 30న హైదరాబాద్‌కు మూడు, చెన్నైకు 2 సర్వీసులు, అక్టోబరు 1న 8, బెంగళూరుకు 3 సర్వీసులు పంపుతామన్నారు. పండుగ ముగిశాక తిరుగు ప్రయాణికుల కోసం రద్దీని బట్టి బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా పరిధిలోని గుంటూరు-1, 2, మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల నుంచి అదనపు సర్వీసులు అందుబాటులో ఉంచుతామన్నారు.

గురజాల స్త్రీ శక్తి కార్యక్రమం మహా అద్భుతం

● మంత్రి నారా లోకేశ్ ● యరపతినేని నిఖిల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు



మంత్రి లోకేశ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న యరపతినేని నిఖిల్

గుంటూరు సిటీ, పిడుగురాళ్ళ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కొత్త చర్చకు తెర తీసిన గురజాల స్త్రీ శక్తి కార్యక్రమం మహా అద్భుతమని మంత్రి నారా లోకేశ్ కితాబిచ్చారు. ఒకేసారి 30 వేల మందికి పైగా మహిళామణులను కార్యక్రమంలో పాల్గొనేలా చేయడం గొప్ప సంగతని అభిప్రాయపడ్డారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చిన్న కుమారుడు నిఖిల్ తన పుట్టినరోజు సందర్భంగా మంగళగిరి కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. ఈ సందర్భంగా గురజాల నియోజకవర్గంలోని పిడు గురాళ్లలో జరిగిన స్త్రీ శక్తి కార్యక్రమాన్ని మంత్రి లోకేశ్ ప్రస్తావించి ప్రత్యేకంగా అభినందించారు. నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి నిఖిల్ మంత్రి లోకేశ్‌కు వివరించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ తాను చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి కూడా తెలిపారు. అన్నింటినీ ఆసక్తిగా విన్న లోకేశ్ మంచి భవిష్యత్తు ఉందంటూ నిఖిల్‌ను కొనియాడారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని మార్గ నిర్దేశం చేశారు. పుట్టినరోజు సందర్భంగా నిఖిల్‌కు మంత్రి స్వీట్స్ తినిపించారు. యరపతినేని నిఖిల్ మంత్రి లోకేశ్‌కు జ్ఞాపికను అందజేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 145, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00


విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

గురుకుల పాఠశాల హాస్టల్ విద్యార్థులకు ఎంపీ దుప్పట్ల పంపిణీ

బాపట్లరూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం స్టూవర్టుపురం గ్రామంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాల వసతి గృహాన్ని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ శనివారం సందర్శించారు. వసతి, భోజన సదుపాయాలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోగిరి శ్రీహరి, భోగిరి శ్రీకాంత్‌ల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన పాల్గొని పంపిణీ చేశారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు ఎంపీ దుప్పట్లు, బుక్స్ పంపిణీ చేశారు.

జిల్లాలో యూరియా పుష్కలంగా ఉంది : కలెక్టర్

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియా పుష్కలంగా ఉందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఈ విషయమై శనివారం ఆయన మాట్లాడుతూ యూరియా కోసం వచ్చే రైతులు సంతోషంగా తీసుకెళ్ళ వచ్చునని చెప్పారు. జిల్లాలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆర్ఎస్‌కేలు, పీఏసీఎస్ కేంద్రాలు ద్వారా112 మెట్రిక్ టన్నుల యూరియాను 978 మంది రైతులకు పంపిణీ చేశారన్నారు. ఇంకా 114 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లాకు నూతన కలెక్టర్‌గా విచ్చేసిన డాక్టర్ వి.వినోద్‌కుమార్‌ను, ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బి.ఉమామహేశ్వర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లాలోని పరిస్థితుల గురించి చర్చించుకున్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యేలు వేగేశన, కొండయ్య



బాపట్ల,సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ బి.ఉమామహేశ్వర్‌ను బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.మాలకొండయ్యలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్క అందజేసి శాలువాతో సత్కరించారు.

కలెక్టర్‌ను కలిసిన బావుడా చైర్మన్



బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారటీ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు శనివారం కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్క అందజేసి అభినందనలు తెలిపారు.

వయోవృద్ధుల ఆరోగ్య సంరక్షణ, భద్రతపై శిక్షణ

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వయోవృద్ధుల ఆరోగ్య సంరక్షణ, భద్రతపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని శనివారం డీఆర్‌సీ సమావేశపు మందిరంలో నిర్వహించారు. వయోవృద్ధుల సంక్షేమంపై పనిచేస్తున్న స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులకు ప్రత్యేకంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా దివ్యాంగులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు పాల్గొని వృద్ధుల సంక్షేమానికి సేవలందిస్తున్న ఎన్‌జీవోలు సమర్థవంతంగా సేవలందించాలని తెలిపారు. ఆ ఉద్దేశంతోనే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని హెరిటేజ్ ఫౌండేషన్ ప్రాంతీయ వనరుల శిక్షణకేంద్రం హైదరాబాద్ ట్రైనర్ రవి నిర్వహించారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు.

సూర్యలంకతీరంలో స్కౌట్ విద్యార్థుల పరిశుభ్రత

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బీచ్ పరిశుభ్రత వారోత్సవాల్లో భాగంగా చెరువుజమ్ములపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల స్కౌట్ విద్యార్థులతో శనివారం సూర్యలంక సముద్రతీరంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. తీరంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. పర్యాటకులకు, సముద్రతీరంలోని వ్యాపారులకు ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. తీరంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరి తోట వెంకటరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటకృష్ణారావు, డీవోసీటీ రవీంద్రబాబు, స్కౌట్ మాస్టర్ బోయిన వీరచంద్ర పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ పశుపోషకులు ప్రభుత్వ పరంగా నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలని బాపట్ల పశువైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జీఎన్‌పాలెంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా పశు సంవర్థకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థవారి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్‌డీ ఏ చేబ్రోలు ఇన్‌చార్జి, ఈవో చలపతిరావు, బాపట్ల జిల్లా పశుసంవర్థకాధికారి వేణుగోపాల్, గ్రామసర్పంచ్ మాధవరావు, మండల పశువైద్యాధికారి శివకుమారి పాల్గొన్నారు.

జ్వరం, జలుబు, దగ్గు తీవ్రంగా ఉంటే వైద్యులను సంప్రదించాలి

● డీఎంహెచ్‌వో విజయమ్మ


ఇంటింటికి సర్వే నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో విజయమ్మ, డాక్టర్ గోపినాథ్ తదితరులు

కర్లపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జ్వరం, జలుబు, దగ్గు తీవ్రత ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని డీఎంహెచ్‌వో విజయమ్మ అన్నారు. శనివారం కర్లపాలెంలో నిర్వహిస్తున్న ఇంటింటి జ్వరాల సర్వేను విజయమ్మ, డాక్టర్ గోపినాథ్, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, పీహెచ్‌సీ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వానాకాలంలో ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల అనేక రోగాలు వస్తాయని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వారిని విమర్శించే క్రమంలో పొరపాటు జరిగింది : వేగేశన

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ విధానాలను విమర్శించే క్రమంలోనే నాయీబ్రాహ్మణుల పట్ల పొరపాటు జరిగిందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్లమెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంతాన్ని శనివారం పరిశీలించిన ఆయన వైసీపీ వారిని విమర్శిస్తూ సామెతగా చేసిన వ్యాఖ్యల వల్ల నాయీబ్రాహ్మణులు నొచ్చుకొని ఉంటే క్షమించాలన్నారు. ఉద్దేశపూర్వకంగా తాను మాట్లాడలేదన్నారు. కావాలని వైసీపీ మద్దతుదారులు బురదజల్లే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రజాహితం కోసమే తాను పనిచేస్తానని చెప్పారు. పెద్దమనసుతో నాయీబ్రాహ్మణులు అర్థం చేసుకోవాలన్నారు. చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు.

నందిరాజుతోటలో స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీ

బాపట్లరూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం ఈస్ట్ బాపట్ల పంచాయతీ నందిరాజుతోట గ్రామంలో శనివారం లబ్ధిదారులకు స్మార్ట్‌రేషన్ కార్డులను రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాతా జయప్రకాష్ నారాయణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్‌బాపట్ల పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నివీరుడి అంత్యక్రియలలో మాజీ సైనికులు

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతపూడి గ్రామానికి చెందిన అగ్నివీర్ మేడిబోయిన వెంకటదుర్గా నరేంద్రరెడ్డి అంత్యక్రియలు శనివారం జరిగాయి. మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, మాజీ సైనికులతో కలిసి వెళ్లి భౌతికకాయంపై జాతీయ జెండా కప్పి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సైనిక వెల్ఫేర్‌బోర్డు సూపరింటెండెంట్ ఆనందరావు, మాజీ సైనిక సంక్షేమ సంఘం బాపట్ల అధ్యక్షుడు పుట్టా ఆదిశేషారెడ్డి, సీహెచ్ వెంకటకృష్ణారావు, షేక్ నిజాముద్దీన్, కె.ఆంజనేయులు, డి.వెంకటేశ్వర్లు, మర్రి వీరాస్వామి, 23ఎన్‌సీసీ ఆంధ్రాబెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ హితం ప్రజల అభిమతం కావాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణహితం ప్రజల అభిమతం కావాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కోరారు. పట్టణంలోని మూడో వార్డు రెల్లీకాలనీలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించి హిందూ శ్మశానవాటిక పరిసరాలను శుభ్రం చేశారు. ప్రధాన రహదారికి ఇరువైపుల మొక్కలు నాటి నీరుపోశారు. పాఠశాల విద్యార్థులతో కలిసి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మూడో శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన ఇంటితోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పల్లం సరోజిని, జి.గిరిజారాణి, సుజాత, హైమావతి, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, మెప్మా సీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ రేపల్లెగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి : ఆర్డీవో


ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీవో రామలక్ష్మి, శివప్రసాద్, సీఐ, కమిషనర్

రేపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ రేపల్లెగా తీర్చిదిద్దేందుకు అన్నిశాఖల అధికారులు సమష్టి కృషితో కృషి చేయాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. పట్టణంలోని తాలూకాసెంటర్‌లో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖద్వారం వద్ద పర్యావరణ పరిరక్షణకోసం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛరేపల్లెగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఇంటికి రెండు మొక్కలుగా నాటి వాటిని పరిరక్షించే విధంగా కృషి చేయాలన్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో పర్యావరణాన్ని కాపాడేవిధంగా ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ అందరి ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. మంత్రిసోదరుడు అనగానిశివప్రసాద్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచితేనే ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, సీఐ మల్లికార్జున్‌రావు, మున్సిపల్ కమిషనర్ ఎ.సాంబశివరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు పాల్గొన్నారు.

● చుండూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించడానికి ప్రతి పౌరుడు బాధ్యతగా గుర్తించాలని ఎండీవో ఎన్.సుదీప కోరారు. శనివారం యడ్లపల్లిలో జరిగిన గ్రీన్ ఏపీ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ పచ్చదనం కోసం ఖాళీ ప్రాంతాల్లో ఫల, పూల మొక్కలు పెంచడం ద్వారా పరిసరాలు పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉంటాయన్నారు. పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలు ఆర్థిక వనరులు పెంచుకోవాలి

గ్రామ పంచాయతీలు ఉన్న ఆర్థిక వనరులు పెంపొందించే విధంగా కృషి చేయాలని ఎండీవో ఎన్.సుదీప కోరారు. శనివారం ఎండీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ సిబ్బంది దీనిపై అవగాహన కల్పించారు. నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాలు, డొంకలు, చెరువులు వంటి వాటి ద్వారా ఆదాయం పెంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

● బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విరివిగా మొక్కల పెంపకాన్ని చేపట్టి పర్యావరణాన్ని పరిరక్షించాలని సర్పంచ్ మద్దిరాల అన్నమ్మ తెలిపారు. కంకటపాలెంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి మూడో శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మొక్కలు నాటి నీరుపోశారు. వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుధాకర్, శ్రీనివాసరావు, దేవరపల్లి రేఖ, ఏఎన్ఎం లు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కంకటపాలెంలో మొక్కలు నాటి నీరుపోస్తున్న గ్రామసర్పంచ్ మద్దిరాల అన్నమ్మ తదితరులు

● పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్ ఆధ్వర్యంలో మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలనే అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుమేరకు ప్రతి మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా చందోలు పోలీసుస్టేషన్ పరిధిలో ఎస్ఐ సిబ్బందితో కలిసి స్టేషన్ ఆవరణం శుభ్రం చేశారు. స్టేషన్ పరిధిలో మొక్కలను నాటారు.

● మండలంలోని పిట్టువారిపాలెం గ్రామపంచాయతీ, మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో మండలస్థాయి అధికారులు ఎంపీడీవో ఎ.ఏలీషాబాబు, తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, గ్రామసర్పంచ్ ఏత్రి అశ్వినిలతో మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్థులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో స్థానిక నాయకులు, అధికారులు, గ్రామపెద్దలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని మొక్కలను నాటారు.

● వేమూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమ సాధనకు సమష్టి కృషి అవసరమని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. శనివారం మండలంలోని జంపని గ్రామంలో నిర్వహించారు. సర్పంచ్ చుండూరు మరియమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. మన ఇంటి పరిసరాల్లో స్వచ్ఛమైన వాతావరణం పాటించడంతో పాటు మనం పని చేసే ప్రాంతాల్లో శుభ్రతగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జంపని హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుశీల, విద్యార్థులు, ఉద్యోగులు, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు.


జంపని హైస్కూల్లో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో రవికుమార్

కార్మిక చట్టాలపై ద్వంద్వ వైఖరి విడనాడాలి : సీఐటీయూ

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల చట్టాలపై ప్రభుత్వాలు ద్వంద్వవైఖరి విడనాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్ డిమాండ్ చేశారు. కార్మిక హక్కుల కోసం ఐక్యపోరాటమే మార్గమన్నారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సీఐటీయూ పట్టణ రెండో మహాసభ పి.పద్మావతి అధ్యక్షతన శనివారం జరిగింది. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి.తిరుమలరెడ్డి, కమిటీ కన్వీనర్ కె.శరత్, కోకన్వీనర్ ఓలక్ష్మణరావు, కె.రవికిరణ్, ఎం.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను మ్యాపింగ్ చేయాలి : తహసీల్దార్

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాను మ్యాపింగ్ చేయాలని తహసీల్దార్ షేక్.సలీమా తెలిపారు. బాపట్ల మున్సిపల్ కౌన్సిల్ హాల్లో శనివారం నియోజకవర్గ బీఎల్‌వోల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 25వ తేదీలోపు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ మ్యాపింగ్ ఆఫ్ ఎలక్టోరల్‌పై పరిశీలన చేయాలని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ జి.రఘునాథరెడ్డి, పిట్టలవానిపాలెం తహసీల్దార్ వెంకటేశ్వరరావు పలు సూచనలు చేశారు.

సుకన్య సమృద్ధి ఖాతా మెచ్యూరిటీపై అవగాహన

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నెహ్రూ యువకేంద్రం గుంటూరు, ఆదర్శ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సుకన్య సమృద్ధి ఖాతా మెచ్యూరిటీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థవారు ఉచితంగా అందిస్తున్న ఉమెన్ టైలరింగ్, కంప్యూటర్ డీటీపీ, 15 రకాల శిక్షణలు గురించి ఆదర్శ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు బొమ్మనబోయిన సాంబయ్య వివరించారు. స్థానిక భావపురి కోచింగ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆవుల వెంకటేశ్వర్లు, శంకర్, శ్రీనివాసరావు, అశోక్‌రాణి, దేవిక తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఎస్టీ కాలనీవాసుల వినతి

బాపట్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి గ్రామపంచాయతీ హనుమంత్‌నగర్ ఎస్టీకాలనీవాసులను అదేప్రాంతానికి చెందిన శివారెడ్డి అనే వ్యక్తి కాలనీలో స్థలం ఆక్రమించి భయపెడుతున్నాడంటూ శనివారం ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. పూర్వం ఫారెస్ట్‌భూమి 5ఎకరాలు యానాదులు నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు ఇచ్చారని అందులో శివారెడ్డి కొంతభూమిని అక్రమించడమే కాకుండా తరుచూ భయపెడుతున్నాడని ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏకసిరి నరసింహారావు అన్నారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫారెస్ట్ అధికారులు రమణారావు, బాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నక్కా నాగేశ్వరరావు, నరసింహారావు ఉన్నారు.

మల్లె రైతులకు శిక్షణ

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాపట్ల వ్యవసాయ కళాశాల దత్త గ్రామమైన కావూరివారిపాలెంలో మల్లెతోటలు సాగు చేస్తున్న రైతులకు సమగ్ర సస్యరక్షణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీచింగ్ అసోసియేట్ డాక్టర్ స్నేహలీల మల్లెలో తాజాగా విస్తరిస్తున్న మొగ్గతొలుచు పురుగు సమస్యను గుర్తించి సమగ్ర సస్య రక్షణ గురించి వివరించారు. అసోసియేట్ ప్రొఫెసర్ ఎ.లలిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.విజయ్ ప్రకాష్, విద్యార్థినులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

కొల్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శక్తి యాప్ గురించి పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొల్లూరులోని జూనియర్ కళాశాలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాలతో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శక్తి యాప్‌ను ఆపదలో ఉన్నప్పుడు బాలికలు, మహిళలు ఏ విధంగా ఉపయోగించుకుని తమను తాము కాపాడుకోవాలో సవివరంగా రేపల్లె సబ్ డివిజన్ శక్తి యాప్ బృందం వివరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాలల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతన జీవో అమలు చేయాలి

కొల్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయితీలలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతన జీవో 551 అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ డిమాండ్ చేశారు. కొల్లూరులోని ప్రజా సంఘాల కార్యాలయం వద్ద సీఐటీయూ కొల్లూరు మండల మహాసభల సందర్భంగా శనివారం వేమూరు కార్యదర్శి బి.అగస్టీన్ జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో జిల్లా అధ్యక్షుడు మణిలాల్ మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులందరికి కనీస వేతనం ఇవ్వాలన్నారు. అగస్టీన్ మాట్లాడుతూ, ఈ నెల 27న రేపల్లెలో నిర్వహిస్తున్న సీఐటీయూ జిల్లా మహాసభలకు కార్మికులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. అనంతరం గ్రామ పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లు నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బొనిగల సుబ్బారావు, అధ్యక్ష, కార్యదర్శులుగా చొప్పర సురేష్, కంచర్ల సుబ్బారావు, చొప్పర శ్రీనివాసరావు, మరో 17 మందిని నూతన కమిటీలో సభ్యులుగా ఎన్నుకున్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

● తహసీల్దార్ శ్రీనివాసరావు

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం భట్టిప్రోలు రెవెన్యూ కార్యాలయ ఆవరణలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి పెంచడం ద్వారా వాతావరణంలోని కాలుష్యాన్ని కొంతవరకు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో డీటీ శాంతలక్ష్మి, లక్ష్మీప్రసన్న, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్‌ని సద్వినియోగం చేసుకోవాలి

నిజాంపట్నం(రేపల్లె), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్త మహిళల ఆరోగ్యాలకు సంజీవని లాంటి కార్యక్రమం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిందని మంత్రి సోదరుడు అనగానిశివప్రసాద్ అన్నారు. రేపల్లె మండలం బేతపూడి, నిజాంపట్నం ప్రభుత్వ వైద్యశాలలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా పరివార్ అభియాన్‌తో మేలు జరుగుతుందని అన్నారు. అనంతరం యువత రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, బొమ్మిడి రామకృష్ణ, ఎస్‌కే ఖాదర్‌బాబు, జనసేన పార్టీ అధ్యక్షులు మైలా నరేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేత

వేమూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు శనివారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది చికిత్స నిమిత్తం అయిన ఖర్చును ప్రభుత్వం ద్వారా అందించాలని కోరుకుంటూ లబ్ధిదారులు ఆనందబాబుకు అర్జీ దాఖలు చేశారు. ఆయన సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10,10,227 విడుదలైంది. సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

సబ్ జైల్‌లో జడ్జి వెన్నెల తనిఖీ


సబ్‌జైల్లో ఆహారపదార్థాలను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పీడీ వెన్నెల

రేపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఖైదీలు క్షణికావేశానికి లోనుకావద్దని, మీ వెనుకాల మీ కుటుంబాలు ఆధారపడి ఉంటాయని సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పిడి వెన్నెల అన్నారు. స్థానిక సబ్ జైల్లోని ఖైదీలకు పెట్టే ఆహారపదార్థాలను శనివారం తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఖైదీలకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చట్టాలపై ఖైదీలు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క ఖైదీ సమయ స్ఫూర్తితో ఉండాలని సూచించారు. ఇప్పుడు చేసిన తప్పులు మరెప్పుడు చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అనంతరం ఖైదీల గదులను పరిశీలించారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూర్చుకోవాలి : ఎంపీపీ

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూర్చుకోవాలని ఎంపీపీ డీవీ లలితకుమారి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీలకు సొంత ఆదాయ వనరులు గురించి నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో శనివారం ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ, శిక్షకులు చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకుని నిబంధనలు పాటిస్తూ వచ్చిన నిధులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో విజయబాబు మాట్లాడుతూ, ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను వర్మికంపోస్టు ఎరువుల అమ్మకాల ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు సురేష్, ఉదయభాస్కర్, సర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయ వనరుల పెంపుదలకు ప్రధాన భూమిక వహించాలి

● చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసరావు

వేమూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల పరిధిలో ఆదాయ వనరుల పెంపుదలకు సర్పంచ్, కార్యదర్శి ప్రధాన భూమిక వహించాలని చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. సొంత ఆదాయ వనరులపై శిక్షణా కార్యక్రమం శనివారం రెండో రోజుకు చేరుకుంది. హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రభుత్వాలు చట్టపరమైన అంశాల ద్వారా పంచాయతీల పరిపాలన విభాగాన్ని సూచించడంతో పాటు ఆదాయ వనరుల పెంపుదలకు కూడా తీసుకోవలసిన చర్యలను వివరించడం జరిగిందన్నారు. కేవలం ప్రభుత్వాల ద్వారా అందే నిధులతో అభివృద్ధి జరపాలన్న ఆలోచన కాకుండా స్థానికంగా ఆదాయ వనరుల పెంపుదలకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మాస్టర్ ట్రైనర్లు సాదిక్ ఆలీ, శ్రీనివాసరెడ్డి, మరికొన్ని సూచనలు చేశారు. 17 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు హాజరయ్యారు.

దస్తావేజు లేకర్ల సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన విధానాల వల్ల తమకు నష్టం జరిగే విధంగా ఉందని దస్తావేజు లేకర్ల సంఘం అధ్యక్షుడు మరకా మురళి అన్నారు. స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద రాష్ట్ర దస్తావేజు లేకర్ల సంక్షేమ సంఘం పిలుపుమేరకు శనివారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఓటీపీ విధానంతో స్టాంప్ కొనే దగ్గర నుంచి స్లాట్ బుక్‌చేసే వరకు ఇబ్బంది పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గోపాల్, సెక్రటరీ బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకోవాలి

రేపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంపొందించుకుని అధిక దిగుబడి సాధించేలా కృషి చేయాలని వ్యవసాయ శాఖ ఏవో కె.మహేష్‌బాబు అన్నారు. మండలంలోని కారుమూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో బీఆర్‌సి షాప్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ విభాగ ఇన్‌చార్జ్‌వినయ్‌కుమార్, సర్పంచ్ గుడి రమాదేవి, అంక సుబ్బారావు, ఎస్ఎస్‌వి, వి.జయలక్ష్మి, రమేష్, సమ్మెట బసవరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

చెరుకుపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛా భారత్ అభియాన్‌లో భాగంగా ప్రతినెలా మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చెరుకుపల్లిలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పి.పద్మ మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. మండల పరిషత్ ఆవరణలో, పశు వైద్యశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, ఈవోపీఆర్డీ శ్రీనివాసన్, సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ ఎం.రాధాకృష్ణమూర్తి, టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, దివి రాంబాబు, కందుల వెంకటేశ్వరరావు, శొంఠి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ సంస్థలను కట్టడి చేయాలి

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రుణగ్రస్థుల ఆస్తులను స్వాధీనం చేసుకునే కార్పొరేట్ ఫైనాన్స్ సంస్థలను కట్టడి చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం డ్రైవర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణగ్రస్థుల అప్పులను రద్దు చేసే చర్యలకు ప్రభుత్వం పూనుకోవాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

బాపట్లరూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనుమానస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే బాపట్ల మండలం వెదుళ్ళపల్లి పరిధిలోని కొత్త కంకటపాలెంలో తారాగ్రేసి అనే మహిళ తనభర్త డానీయేల్‌తో కలిసి జీవనం కొనసాగించేది. అయితే తారాగ్రేసి మృతి చెందటంతో ఆమె తండ్రి యోహోను తన కుమార్తె మృతిపై అనుమానం ఉందని విచారణ చేపట్టాలని వెదుళ్ళపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వెదుళ్ళపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బాపట్లరూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం అప్పికట్ల సమీపంలోని యరకాల్వలో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. బాపట్ల రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్ట్‌మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు.



మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలి

సీఎంకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు వినతి

మాచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాచర్లలో మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. శనివారం మాచర్లలో జరిగిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర సభలో ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. గోదావరి నీటిని సాగర్ కుడి కాల్వకు కలపడం ద్వారా మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లోని అనేక గ్రామాలకు తాగునీటిని స్థిరీకరించవచ్చన్నారు. నవంబరు, డిసెంబరు నాటికే భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, ఆరు దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

సూపర్ సిక్స్ సూపర్‌హిట్

ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా సూపర్ సిక్స్‌ను అమలు చేస్తూ సీఎం సూపర్‌హిట్ చేశారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. 75 ఏళ్ల వయసులో కూడా చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి కష్టపడుతున్నారన్నారు. పది లక్షల కోట్ల అప్పు ఉన్నా ఏమాత్రం భయపడలేదన్నారు. చంద్రబాబుపై నమ్మకంతోనే రూ.పది లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. బనకచర్ల ద్వారా రాయలసీమకు నీరు అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. మోసానికి, అరాచకానికి, విధ్వంసానికి బ్రాండ్ అంబాసిడర్ జగన్ అని తెలిపారు. మాచర్లను ఆదుకోవాల్సిన బాధ్యత సీఎంపై ఉందన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

టీడీపీకి కార్యకర్తలే బలం

- వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- కూల్‌గా శ్రీకృష్ణదేవరాయలు.. ఫైర్‌బ్రాండ్‌గా బ్రహ్మారెడ్డి
- కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

మాచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలం అని, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. మాచర్లలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగం గా టీడీపీ కార్యకర్తలతో చంద్రబాబు సమావేశమై ప్రసంగించారు. మాచర్లలో ఇరవై సంవత్సరాలు కష్టపడ్డారని, సరైన నాయకత్వ లేకపోవడంతో నష్టపోయామని, ఇక నుంచి అలా జరగకుండా చూస్తామన్నారు. సరైన సమయంలో మాచర్ల, పులివెందులలో దుర్మార్గాలను అడ్డుకోగలిగామన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కూల్‌గా పనిచేసుకుని వెళ్తుండగా, ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి అందుకు భిన్నంగా ఫైర్‌బ్రాండ్‌గా ఉంటూ కార్యకర్తలను కాపాడుకోవడంలో ముందున్నారన్నారు. మాచర్ల నియోజకవర్గంలో చంద్రయ్య, జల్లయ్యలను నష్టపోతే వారి కుటుంబాలకు నష్ట పరిహారం కూడా అందించామన్నారు. కార్యకర్తలంతా ఐక్యంగా ఉండి పార్టీకి సేవలందించాలని కోరారు. ఎక్కడో రాజీవ్‌గాంధీ చనిపోతే మాచర్లను తగలబెట్టారని, ఆ తదుపరి 20 ఏళ్లు వారి ఇష్టారాజ్యంగా యేలారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని జూలకంటిని ఈ ఎన్నికల్లో అభ్యర్థిగా దించామన్నారు. రౌడీయిజాన్ని తట్టుకుంటే మాచర్ల ఎల్లప్పుడూ టీడీపీదేనని అన్నారు.



చంద్రబాబుకు అభివాదం చేస్తున్న మహిళలు

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాచర్లలోని యాదవులబజారులో పారిశుధ్య కార్మికులతో కలిసి చీపురు పట్టి రోడ్డు ఊడ్చారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రత లేకపోతే వ్యాధులు ప్రబలి, అనారోగ్యాలకు గురై ఆర్థికంగా నష్టపోతారని వివరించారు. పారిశుధ్య కార్మికులు కూడా పని ప్రదేశాల్లో చేతులకు గ్లౌజులు ఉపయోగించాలన్నారు. పారిశుధ్య కార్మికులతో ప్రత్యేకంగా సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను, వారి అనుభవాలను తెలుసుకున్నారు. అనంతరం సాగర్‌రోడ్డులోని ఆర్టీసీ గ్యారేజీ ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛరథాలను ప్రారంభించారు. స్వచ్ఛరథంలో అందించే సేవల గురించి వైద్యులతో చంద్రబాబు చర్చించారు.



డ్వాక్రా ఉత్పత్తులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, కలెక్టర్ కృతికాశుక్లా



యాదవ బజారులో స్థానికులతో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

మోడల్ మున్సిపాలిటీగా

మాచర్ల

మాచర్ల నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వరాల జల్లు కురిపించారు. మాచర్లను ఆదర్శ మునిసి పాల్టీగా తీర్చిదిద్దు తామని, రూ 50 కోట్లు నిధులు మంజూరు చేస్తామని హా మీ ఇచ్చారు. పల్నాడు జిల్లాతో పాటు మాచర్ల తలసరి ఆదా యం తక్కువగా ఉందని చెప్పారు. అన్ని ప్రాంతా లతో సమా నంగా తలసరి ఆదాయం పెంచేందుకు ప్రణాళిక రూపొందిస్తా మని సీఎం ప్రకటించారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా మూ డేళ్లలో ప్రతి ఇంటికి నీళ్లు ఇస్తామని, అమృత్ పథకంలో భాగంగా మాచర్ల తాగు నీటి పథకం విస్తరించి నీరందిచడం జరగు తుంద న్నారు. పల్నాడు జీవనాడి వరికపూడిశెల సఫలీకృతం చేసే బాధ్యత తాను తీసుకుంటా నని సీఎం హామీ ఇచ్చారు. దీని ద్వారా 1.25 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్న సీఎం.. లక్షమందికి తాగు నీరు అందించే అవకాశం ఉందన్నారు. మొదటి దశలో 1.25 టీఎంసీలు, రెండవ దశలో 6.5 టీఎంసీలు నీరు అందింజేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుం దన్నారు. పక్కనే నాగార్జున సాగర్ ఉన్నా.. మాచర్లకు నీరు లేదని, ప్రతి ఎకరాకు నీరు ఇచ్చే విధంగా అన్ని నదులను అనుసంధానం చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. గోదావరి జలాలను కుడి కాల్వకు తీసుకొస్తా మన్నారు. రైతుల కోరిక మేరకు ఈ ప్రాంతానికి మిరప బోర్డును తీసుకొచ్చే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. మాచర్లలో వంద పడకల ఆస్ప త్రిని కూడా మంజూరు చేస్తానని చంద్రబాబు చెప్పారు. పల్నాటి ఉత్సవాలను ప్రభుత్వ పరంగా నిర్వహిస్తామని చె ప్పారు. ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని చంద్రబాబు కలెక్టర్‌ను ఆదేశించారు.

మాచర్లకు స్వాతంత్ర్యం వచ్చింది

(5వ పేజీ తరువాయి)

రౌడీయిజం.. నేరాలు ఘోరాలు చేస్తే ఊరుకునేది లేదు. మంచి కార్యక్రమాలు చేసి ప్రజల అభిమానాలు పొందాలి. ప్రజల ఆస్తులకు రక్షణగా నిలబడతాం. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర మంచి కార్యక్రమంలో పాల్గొన్నాను. ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలి. ఇక్కడ నేతల మనసుల్లో ఉన్న చెత్తను కడిగేస్తే తప్ప ఈ మాచర్ల బాగుపడదు. గత ప్రభుత్వంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తంతా రోడ్లపై వేశారు. ఈ చెత్తను క్లీన్ చూసే బాధ్యతను తీసుకున్నాను. చెత్తను క్లీన్ చేసినట్టే చెత్త రాజకీయాలను క్లీన్ చేస్తాను. మాచర్ల ఎన్నికల్లో చశాను. ప్రజాగ్రహం ఎలా ఉంటుందో 33 వేల మేజార్టీతో గెలిపించి చూపించారు. మాచర్ల అనగానే.. రోడ్డుపై అతి కిరాతకంగా కత్తితో జగన్‌కు జై కొట్టాలని బెదిరించినా జై చంద్రబాబు అన్న చంద్రయ్యను హత్య చేశారు. జాలయ్యకు రక్షణ లేకపోతే ఎక్కడకో పోయి తలదాచుకుంటే అతి కిరాతకంగా చంపేశారు. నంబూరు శేషగిరి రావు కూడా వీరోచితంగా పోరాడారు. అలాంటి ప్రజాస్వామ్య వీరులకి శ్రద్ధాంజలి ఘటించి.. చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇస్తున్నాం. ఎవరికి అన్యాయం జరిగినా ఈ ప్రభుత్వం ఉపేక్షించదు. న్యాయం చేసే వరకు అండగా ఉంటాం. ఐదేళ్లు నాలాంటి నాయకుడే మాచర్లకు రాలేకపోయిన పరిస్థితి. నేడు ఏవరైనా మాచర్లకు స్వేచ్ఛగా రాగలుగుతున్నారు. అది అప్పటి పరిపాలన, ఇది ఇప్పటి పరిపాలన.' అని సీఎం చంద్రబాబు పరోక్షంగా పిన్నెల్లి సోదరులను చంద్రబాబు హెచ్చరించారు. సభలో రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ కృతికా శుక్లా, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభి, ప్రభుత్వ కార్యదర్శి సురేష్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ డి.వేణుబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నీలావతి

రెండు బంగారు కుటుంబాలు దత్తత

(5వ పేజీ తరువాయి)

రావడం లేదని ఆమె తెలపడంతో..వెంటనే స్పందించిన సీఎం చంద్రబాబు.. వితంతు పింఛన్ ఆమెకు మంజూరు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

నీలావతి కుటుంబాన్ని పీ4 కింద దత్తత తీసుకోవడానికి కేసీపీ సంస్థ ముందుకొచ్చింది. నీలావతికి తమ సంస్థలో పని కల్పిస్తామని సీనియర్ జనరల్ మేనేజర్ వైకుంఠం వెంకటరమణ వేదికపై ప్రకటించారు. ఆమెతో పాటు 50 మందికి కుట్టు మిషన్లు అందిస్తామని తెలిపారు. పిల్లలను ఉన్నత చదువుల బాధ్యతను కేసీపీ తీసుకోవాలని సీఎం కోరడం, వెంటనే అందుకు అంగీకరించడంతో.. కేసీపీ సంస్థను చంద్రబాబు అభినందించారు. సంస్థ ఇంకా ఎన్ని కుటుంబాలను దత్తత తీసుకుంటుందో తెలపాలని, ఈ విషయంలో నాన్పేద్దని చంద్రబాబు కోరారు. దీంతో మరికొన్ని కుటుంబాలను దత్తత తీసుకుంటామని మేనేజర్ ప్రకటించారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడంతోనే సరిపోదని, ఆ కుటుంబాల తలసరి ఆదాయం పెరగాలన్నారు. భవిష్యత్‌లో దీనిని పరిశీలించడం జరుగుతుందని చంద్రబాబు చెప్పారు.

కుమార్తె, చెల్లిని చదివించాలి : నజీరున్

మాచర్లకు చెందిన షేక్ నజీరున్‌ను మరో బంగారు కుటుం బంగా ఎంపిక చేశారు. ఈమె తను పడుతున్న కష్టాల ను చంద్రబాబుకు విన్నవించింది. తన భర్త చనిపోయాడని, కు మార్తె ఉందని.. కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషి స్తున్నానని పేర్కొంది. తనకు చెల్లి ఉంది. కుమార్తెతో పాటు తన చెల్లిని చదివించే బాధ్యత తనపై ఉందని చెప్పుకొచ్చింది. తల్లి ఇటీవలే మరణించిందని, తండ్రి అనారోగ్యంతో ఉన్నా రని.. కూతురు, చెల్లి ఇద్దరు డిగ్రీ చదువుతున్నారని.. ఇద్దరి చదువుకు సాయం అందించాలని కోరింది. దుర్గికి చెందిన విత్తన కంపెనీ యజమాని యాగంటి వెంకటేశ్వర్లు నజీరున్ బంగారు కుటుంబానికి మార్గదర్శిగా నిలిచారు. ఆ ఇద్దరి చదు వుకు సాయం అందిస్తానని వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ ఇద్దరు ఎంత వరకు చదువుతారో చదివించి వారిని సెటిల్ చేయాలని చంద్రబాబు సూచించారు. ఈ కుటుంబాన్ని దత్తత తీసుకున్న వెంకటేశ్వర్లును అభినందించా రు.ఆమె తండ్రికి పింఛన్‌కు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు.



చంద్రబాబుతో మాట్లాడుతున్న నజీరున్

ఆహ్లాదం.. ఎకో-టూరిజం



ఎకో-టూరిజం ప్రధాన ద్వారం

- సూర్యలంకలో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా కాటేజీలు

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరంలో ఎకో-టూరిజం కాటేజీలను అత్యంత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. జీడిమామిడి తోటల మధ్య 45 రకాల చెట్లు, మొక్కల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో చూడ ముచ్చటగా ఉన్న కాటేజీలలో సేద తీరేందుకు దూర ప్రాంతాలు నుంచి ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకొని పర్యాటకులు వస్తున్నారు. సూర్యలంక నేచర్ క్యాంపు రిసార్ట్స్‌గా ఏర్పాటు చేసిన వీటిలో పర్యాటకుల కోసం బీచ్ సఫారీ, సైకిల్ సఫారీ సదుపాయం కూడా కల్పించారు. కాటేజీల చుట్టూ 45 రకాల మొక్కలు పెంచుతున్నారు. వేసవిలో కూడా చల్లటి వాతావరణంలో ప్రకృతిని ఆస్వాదిస్తూ కాటేజీలలో సరదాగా గడిపేందుకు ఏర్పాట్లు చేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఎకో-టూరిజం కాటేజీలకు ఆ తర్వాత వైసీపీ పాలనలో ఆదరణ కరువైంది. వీటి అభివృద్ధిని వైసీపీ పాలకులు గాలికి వదిలేశారు. మొక్కుబడిగా నిర్వహిస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై మరలా దృష్టి సారించింది. ఇక్కడ మొత్తం 6 కాటేజీలు, ఒక డార్మెటరీ, రెస్టారెంట్, వాటర్‌ప్లాంట్ ఉండగా.. ప్రస్తుతం మరో 6 కాటేజీలు అత్యాధునికంగా ఏర్పాటు చేశారు.

కొరవడిన ఆదరణ

సముద్రానికి కొంత దూరంలో ఎకో-టూరిజం కాటేజీలు ఉండటంతో పర్యాటకుల ఆదరణ కరువైంది. సముద్రం ఎదురుగా ఉండే కాటేజీలకే పర్యాటకులు మొగ్గు చూపుతు న్నారు. అయితే ఇక్కడ పచ్చటి మొక్కలు, చెట్లు, ఆహ్లాదాన్ని పంచే విధంగా ఉన్నాయి. ఆరోగ్యానికి ఉపయోగపడే ప్రకృతి మధ్య ఉండాలనుకునే వారు ఎక్కువగా ఇక్కడకు వస్తుంటారు. సముద్రాన్ని సందర్శించిన తర్వాత ఇక్కడకు వచ్చి మంచి నీటితో స్నానాలు చేసి సేద తీరే అవకాశం ఉంది. కాబట్టి ప్రభుత్వం దీనిని మరింతగా అభివృద్ధి చేసేందుకు అడుగులు వేస్తోంది.





నూతనంగా నిర్మించిన కాటేజీలు



ఎకోటూరిజంలో పర్యాటకులు తిరిగేందుకు ఏర్పాటు చేసిన సైకిళ్ళు

కాటేజీలకు సంబంధించిన ధరలు

సూర్యలంక తీరంలోని ఎకో-టూరిజం కాటేజీలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి. సోమవారం నుంచి గురువారం వరకు 24 గంటలకు పాత కాటేజీలకు రూ.3,472, కొత్త కాటేజీలకు రూ. 2,912 ధరను నిర్ణయించారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు పాత కాటేజీలకు రూ. 3,819, కొత్త కాటేజీలకు రూ. 3,203 ధరను నిర్ణయించారు. డార్మెటరీలో మొత్తం 6 బెడ్‌లు ఉండగా.. దీనికి రూ. 4,816 ధరను నిర్ణయించారు. ఎక్స్‌ట్రా బెడ్‌కు విడిరోజుల్లో రూ.998, వారాంతాల్లో రూ. 1098 ధరను నిర్ణయించారు. ఇక్కడ చిన్నచిన్న ఫంక్షన్‌లకు, ఫొటో షూట్‌లకు అవకాశం కల్పిస్తున్నారు.



ఆహ్లాదకరమైన వాతావరణంలో మినీ ఫంక్షన్‌గ్రౌండ్

టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు


ఎకో-టూరిజం కాటేజీలను మరింత అభివృద్ధి చేసేందుకు అనేక ప్రతిపాదనలు చేశారు. ఇక్కడ సేద తీరే పర్యాటకులు సముద్రానికి వెళ్ళేందుకు ఒక వాహనం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పిల్లల పార్కు అభివృద్ధి, గ్రీనరీ డెవలప్‌మెంట్, మినీ థియేటర్ సౌకర్యంతోపాటు కాటేజీలు పెంచే ఆలోచన చేస్తున్నారు. ప్రభుత్వం దీనికి సంబంధించి నిధులు మంజూరు చేసిన వెంటనే అన్ని రకాల వసతులతో పర్యాటకులకు ఆహ్లాదకరమైన కాటేజీలు మరిన్ని అందుబాటులోకి రానున్నాయి.

తెలుగు భాషోద్దీపనం ద్వారానే

సాంస్కృతిక వికాసం

- లఘు చిత్రాల ప్రదర్శన సభలో వక్తలు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భాషను, సాహిత్యాన్ని, కళలను, ఆచారాలను గౌరవించడం ద్వారానే తెలుగు వికాసాన్ని, సంస్కృతిని రక్షించవచ్చని 2026 ప్రపంచ తెలుగు మహాసభల సన్నాహక కార్యక్రమంలో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గుంటూరు భారతీయ విద్యాభవన్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో శనివారం ఆంధ్రా సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో 2026లో జరగనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన లఘు చిత్రాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా గిడుగు రామ్మూర్తి పంతులుపై కొత్తపల్లి సీతారాం నిర్మించి దర్శకత్వం వహించి కృత్రిమ మేధస్సుతో రూపొందించిన "తెలుగు వెలుగు గొడుగు గిడుగు" లఘు చిత్రం విశేషంగా ఆకర్షించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఎన్టీఆర్ తన చిత్రాల ద్వారా భాషా ఉన్నతికి కృషి చేశారని, ఆయన అడుగుజాడల్లో పయనించాలని కోరారు. మాజీ ఎంపీ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ, జాతి అస్తిత్వానికి మాతృభాష కొలమానమని అన్నారు. గ్రాంథిక భాష నుంచి వ్యవహారిక భాష ప్రాధాన్యాన్ని గుర్తించి దాని అభివృద్ధికి గిడుగు రామ్మూర్తి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ మాట్లాడుతూ, ప్రత్యేక మంత్రిత్వశాఖ ద్వారా తెలుగు భాషా వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు పొడపాటి తేజస్విని మాట్లాడుతూ, వేమన, సుమతీ శతకాల ద్వారా తెలుగు భాషా మాధుర్యాన్ని రుచి చూడవచ్చని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలు చరిత్రలో చిరస్థాయిగా మిగిలేలా కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీ వీసీ వాసిరెడ్డి విద్యాసాగర్, బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బుచ్చిరాంప్రసాద్, సినీ ప్రముఖులు దశరథ్, కోన వెంకట్, డీవై చౌదరి, బీవీఎస్ రవి, సిరాశ్రీ, సమన్వయకర్త పీ.రామచంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.



లఘు చిత్రాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, గజల్ శ్రీనివాస్, పొడపాటి తేజస్విని, సినీ ప్రముఖులు

నేడు బల్లికురవలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

బల్లికురవ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బల్లికురవలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. వినియెగదారులు విద్యుత్ అంతరాయాన్ని గమనించాలని ఆయన కోరారు. గ్రామంలో ఆర్డీఎస్ఎస్ వర్క్ పనులు జరుగుతున్నాయని వారం రోజుల్లో పూర్తి స్థాయిలో పనులు పూర్తి అవుతాయని తెలిపారు.

టీకాల కార్యక్రమాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో

పర్చూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు పశువైద్యశాలలో పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా చేపడుతున్న టీకాల కార్యక్రమాన్ని శనివారం బాపట్ల డీఏహెచ్‌వో బి.వేణుగోపాల్ పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఏడీ మాధవి పాల్గొన్నారు.

పోషకాహార కిట్లు పంపిణీ

మార్టూరు,సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి శనివారం స్థానికంగా వెలుగు కార్యాలయంలో ఫ్రెండ్స్ న్యూ జనరేషన్ డెవెలెప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో న్యూట్రియేషన్ కిట్లు పంపిణీ చేశారు. న్యూట్రియేషన్ డొనేషన్ ప్రోగ్రాంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 40 మందికి అందజేశారు. డాక్టర్ భాగ్యలక్ష్మి, హనుమంతు, ఏపీఎం సురేంద్ర, సీసీలు మహేష్, శోభన్, కానిస్టేబుల్ రమేష్, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలను పెంచేలా కృషి చేయాలి

మార్టూరు,సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యాప్రమాణాలను పెంచేవిధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎంఈవో వస్రాం నాయక్ చెప్పారు. శనివారం మండలంలోని ద్రోణాదుల జడ్పీ హైస్కూలులో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలలో ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడారు. అదేవిధంగా వలపర్ల కాంపెక్స్ సమావేశానికి ఎంఈవో ప్రేమలత, కోలలపూడిలో చలపతి, మార్టూరులో ఏ శ్రీనివాసరావులు నోడల్ అధికారులుగా వ్యవహరించారు. అదేవిధంగా యద్దనపూడిలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు ఛైర్మన్‌గా దేవేంద్రరావు వ్యవహరించారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యం అవసరం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో విద్యార్థి అన్ని విధాల అభివృద్ధి సాధిస్తారని ఎంఈవో శ్రీనివాసరావు చెప్పారు. శనివారం మండలంలోని ధర్మవరం ప్రాథమిక పాఠశాలలో జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం హెచ్‌ఎం సోమేపల్లి హనుమంతరావు అధ్యక్షతన జరిగింది. అనంతరం విద్యలో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన తెలుగు వాచకం, అభ్యసన దీపిక పుస్తకాలను ఆవిష్కరించిం విద్యార్థులకు పంపిణీ చేశారు. ధర్మవరం హెచ్ పాఠశాల హెచ్‌ఎం సుబ్బరాజు, ఎస్‌ఎల్‌వీ దేవి, విద్యా కమిటీ ఛైర్మన్ ఉప్పు వెంకట్రావు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సంతమాగులూరు సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : సముతుల్య ఆహారంతోనే గర్భిణులకు, బాలింతలకు, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సంతమాగులూరు ఐసీడీఎస్ సూపర్ వైజర్ జి.ప్రమీల చెప్పారు. రాష్ట్రీయ 8వ పోషణ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం ఏల్చూరి గ్రామంలో పోషక విలువల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు దుర్గ, చిన్నమ్మాయి, షకీరా, బసవమ్మ, బోడెమ్మ, పద్మ, తిరుమల, మస్తాన్‌బీ, మస్తానమ్మ పాల్గొన్నారు

ఆహ్లాదకరం.. ఎకో-టూరిజం


ఎకో-టూరిజం ప్రధాన ద్వారం

సూర్యలంకలో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా కాటేజీలు

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరంలో ఎకో-టూరిజం కాటేజీలను అత్యంత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. జీడిమామిడి తోటల మధ్య 45 రకాల చెట్లు, మొక్కల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో చూడముచ్చటగా ఉన్న కాటేజీలలో సేద తీరేందుకు దూర ప్రాంతాల నుంచి ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకొని పర్యాటకులు వస్తున్నారు. సూర్యలంక నేచర్ క్యాంపు రిసార్ట్స్‌గా ఏర్పాటు చేసిన వీటిలో పర్యాటకుల కోసం బీచ్ సఫారీ, సైకిల్ సఫారీ సదుపాయం కూడా కల్పించారు. కాటేజీల చుట్టూ 45 రకాల మొక్కలు పెంచుతున్నారు. వేసవిలో కూడా చల్లటి వాతావరణంలో ప్రకృతిని ఆస్వాదిస్తూ కాటేజీలలో సరదాగా గడిపేందుకు ఏర్పాట్లు చేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఎకో-టూరిజం కాటేజీలకు ఆ తర్వాత వైసీపీ పాలనలో ఆదరణకు కరువైంది. వీటి అభివృద్ధిని వైసీపీ పాలకులు గాలికి వదిలేశారు. మొక్కుబడిగా నిర్వహిస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై మరలా దృష్టి సారించింది. ఇక్కడ మొత్తం 6 కాటేజీలు, ఒక డార్మెటరీ, రెస్టారెంట్, వాటర్‌ప్లాంట్ ఉండగా.. ప్రస్తుతం మరో 6 కాటేజీలను అత్యాధునికంగా ఏర్పాటు చేశారు.


నూతనంగా నిర్మించిన కాటేజీలు




ఎకోటూరిజంలో పర్యాటకులు తిరిగేందుకు ఏర్పాటు చేసిన సైకిళ్ళు

కొరవడిన ఆదరణ

సముద్రానికి కొంత దూరంలో ఎకో-టూరిజం కాటేజీలు ఉండటంతో పర్యాటకుల ఆదరణ కరువైంది. సముద్రం ఎదురుగా ఉండే కాటేజీలకే పర్యాటకులు మొగ్గు చూపుతు న్నారు. అయితే ఇక్కడ పచ్చటి మొక్కలు, చెట్లు, ఆహ్లాదాన్ని పంచే విధంగా ఉన్నాయి. ఆరోగ్యానికి ఉపయోగపడే ప్రకృతి మధ్య ఉండాలనుకునే వారు ఎక్కువగా ఇక్కడకు వస్తుంటారు. సముద్రాన్ని సందర్శించిన తర్వాత ఇక్కడకు వచ్చి మంచి నీటితో స్నానాలు చేసి సేద తీరే అవకాశం ఉంది. కాబట్టి ప్రభుత్వం దీనిని మరింతగా అభివృద్ధి చేసేందుకు అడుగులు వేస్తోంది.

కాటేజీలకు సంబంధించిన ధరలు

సూర్యలంక తీరంలోని ఎకో-టూరిజం కాటేజీలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి. సోమవారం నుంచి గురువారం వరకు 24 గంటలకు పాత కాటేజీలకు రూ.3,472, కొత్త కాటేజీలకు రూ. 2,912 ధరను నిర్ణయించారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు పాత కాటేజీలకు రూ. 3,819, కొత్త కాటేజీలకు రూ. 3,203 ధరను నిర్ణయించారు. డార్మేటరీలో మొత్తం 6 బెడ్‌లు ఉండగా.. దీనికి రూ. 4,816 ధరను నిర్ణ యించారు. ఎక్స్‌ట్రా బెడ్‌కు విడిరోజుల్లో రూ.998ని, వారాం తాల్లో రూ. 1098 ధరను నిర్ణయించారు. ఇక్కడ చిన్న చిన్న ఫంక్షన్‌లకు, ఫొటో షూట్‌లకు అవకాశం కల్పిస్తున్నారు.


ఆహ్లాదకరమైన వాతావరణంలో మినీ ఫంక్షన్‌గ్రౌండ్

టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు

ఎకో-టూరిజం కాటేజీలను మరింత అభివృద్ధి చేసేందుకు అనేక ప్రతిపాదనలు చేశారు. ఇక్కడ సేద తీరే పర్యాటకులు సముద్రానికి వెళ్ళేందుకు ఒక వాహనం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పిల్లల పార్కు, అభివృద్ధి, గ్రీనరీ డెవలప్‌మెంట్, మినీ థియేటర్ సౌకర్యంతోపాటు కాటేజీలు పెంచే ఆలోచన చేస్తున్నారు. ప్రభుత్వం దీనికి సంబంధించి నిధులు మంజూరు చేసిన వెంటనే అన్ని రకాల వసతులతో పర్యాటకులకు ఆహ్లాదకరమైన కాటేజీలు మరిన్ని అందుబాటులోకి రానున్నాయి.

భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన పర్యావరణం

చీరాల్లో ఘనంగా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర

చీరాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన పర్యావరణ కల్పన ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ఒక మొక్కనాటి సంరక్షించాలని ఎమ్మెల్యే కొండయ్య పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం కొత్తపేట జిల్లా పరిషత్ ఇంజనీరింగ్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈసందర్భంగా ముందుగా మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పారిశుధ్య కార్మికులకు నిత్యవసరాలు అందజేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో విధిగా చెత్త సేకరణ జరగాలని సూచించారు. బ్లీచింగ్, ఫాగింగ్ నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేష్ బాబు, ఈవోఆర్డీ శ్రీనివాసరావు, సెక్రటరీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


నల్లబర్లీ పొగాకును పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ఆర్డీవో ఆధ్వర్యంలో..

పట్టణంలో ఆర్డీవో ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా పట్టణంలో యువనాయకులు గౌరీ అమర్నాథ్, మున్సిపల్ ఛైర్మన్ సాంబశివరావు, కమిషనర్ అబ్దుల్ రషీద్‌లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కాలుష్య రహిత చీరాలగా రూపుదిద్దుకునేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలన్నారు. మానవహారం నిర్వహించారు.

ఎస్పీని కలిసిన చీరాల, బాపట్ల ఎమ్మెల్యేలు

ఎస్పీ ఉమమాహేశ్వర్‌ను శనివారం చీరాల, బాపట్ల ఎమ్మెల్యేలు ఎంఎం కొండయ్య, నరేంద్రవర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జిల్లాకు బాధ్యతలు చేపట్టిన ఎస్పీకు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, గంజాయి, మాదక ద్రవ్యాల కట్టడికి కృషి చేయాలని కోరారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి

పర్చూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులందరూ ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ చెప్పారు. పర్చూరులోని ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనుగోలు చేసి నిల్వ ఉంచిన గోదాములను శనివారం శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్లాక్ బర్లీ పొగాకును రానున్న సంవత్సరంలో సాగు చేయవద్దని సూచించారు. ఇప్పటి వరకు రూ.92 కోట్లు విలు చేసే 12,500 టన్నుల బ్లాక్ బర్లీ పొగాకును కొనుగోలు చేసినట్లు చెప్పారు. అనధికారికంగా సుమారు 30వేల టన్నులు పొగాకు రైతుల వద్దనే ఉంటుందని ప్రాథమిక అంచనాలు వేశామన్నారు. రైతులు సంక్షోభం నుంచి బయటకు తీసుకురావాలంటే ప్రభుత్వ ప్రణాళిక మేరకు పంటల సాగు ప్రక్రియ చేపట్టాలని చెప్పారు. మిగిలిన పొగాకు సమస్యను ఎమ్మెల్యే ఏలూరి కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి రమేష్‌బాబు, ఆర్డీవో గ్లోరియా పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై అవగాహనా ర్యాలీలో కలెక్టర్, ఎమ్మెల్యే

స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్చూరులో ఆయా పాఠశాలల విద్యార్థులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే ఏలూరి పాల్గొన్నారు. తొలుత స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి బొమ్మల సెంటర్‌లో మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో డీపీవో ప్రభాకర్, ఎంపీడీవో వెంకటస్వామి, తహసీల్దార్ బ్రహ్మయ, ఈవోఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి, వేదికపై కలెక్టర్ వినోద్‌కుమార్

మాచర్లకు స్వాతంత్ర్యం వచ్చింది

(5వ పేజీ తరువాయి)

రౌడీయిజం.. నేరాలు ఘోరాలు చేస్తే ఊరుకునేది లేదు. మంచి కార్యక్రమాలు చేసి ప్రజల అభిమానాలు పొందాలి. ప్రజల ఆస్తులకు రక్షణ నిలబడతాం. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర మంచి కార్యక్రమంలో పాల్గొన్నాను. ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలి. ఇక్కడ నేతల మనసుల్లో ఉన్న చెత్తను కడిగేస్తే తప్ప ఈ మాచర్ల బాగుపడదు. గత ప్రభుత్వంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తంతా రోడ్లపై వేశారు. ఈ చెత్తను క్లీన్ చేసే బాధ్యతను తీసుకున్నాను. చెత్తను క్లీన్ చేసినట్టే చెత్త రాజకీయాలను క్లీన్ చేస్తాను. మాచర్ల ఎన్నికల్లో చశాను. ప్రజాగ్రహం ఎలా ఉంటుందో 33 వేల మేజార్టీతో గెలిపించి చూపించారు. మాచర్ల అనగానే.. రోడ్డుపై అతి కిరాతకంగా కత్తితో జగన్‌కు జై కొట్టాలని బెదిరించినా జై చంద్రబాబు అన్న చంద్రయ్యను హత్య చేశారు. జాలయ్యకు రక్షణ లేకపోతే ఎక్కడకో పోయి తలదాచుకుంటే అతి కిరాతకంగా చంపేశారు. నంబూరు శేషగిరి రావు కూడా వీరోచితంగా పోరాడారు. అలాంటి ప్రజాస్వామ్య వీరులకి శ్రద్ధాంజలి ఘటించి.. చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇస్తున్నాం. ఎవరికి అన్యాయం జరిగినా ఈ ప్రభుత్వం ఉపేక్షించదు. న్యాయం చేసే వరకు అండగా ఉంటాం. ఐదేళ్ల నాలాంటి నాయకుడే మాచర్లకు రాలేకపోయిన పరిస్థితి. నేడు ఏవరైనా మాచర్లకు స్వేచ్ఛగా రాగలుగుతున్నారు. ఆది అప్పటి పరిపాలన, ఇది ఇప్పటి పరిపాలన.' అని సీఎం చంద్రబాబు పరోక్షంగా పిన్నెల్లి సోదరులను చంద్రబాబు హెచ్చరించారు. సభలో రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ కృతికా శుక్లా, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కె.పట్టాభి, ప్రభుత్వ కార్యదర్శి సురేష్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ డి.వేణుబాబు పాల్గొన్నారు.

రెండు బంగారు కుటుంబాలు దత్తత

(5వ పేజీ తరువాయి)

రావడం లేదని ఆమె తెలపడంతో..వెంటనే స్పందించిన సీఎం చంద్రబాబు.. వితంతు పింఛన్ అమెకు మంజూరు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

నీలావతి కుటుంబాన్ని పీ4 కింద దత్తత తీసుకొవడానికి కేసీపీ సంస్థ ముందుకొచ్చింది. నీలావతికి తమ సంస్థలో పని కల్పిస్తామని సీనియర్ జనరల్ మేనేజర్ వైకుంఠం వెంకటరమణ వేదికపై ప్రకటించారు. ఆమెతో పాటు 50 మందికి కుట్టు మిషన్లు అంస్తామని తెలిపారు. పిల్లలను ఉన్నత చదువుల బాధ్యతను కేసీపీ తీసుకొవాలని సీఎం కోరడం, వెంటనే అందుకు అంగీకరించడంతో.. కేసీపీ సంస్థను చంద్రబాబు అభినందించారు. సంస్థ ఇంకా ఎన్ని కుటుంబాలను దత్తత తీసుకుంటుందో తెలపాలని, ఈ విషయంలో నాస్పేద్దని చంద్రబాబు కోరారు. దీంతో మరి కొన్ని కుటుంబాలను దత్తత తీసుకుంటామని మేనేజర్ ప్రకటించారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడంతోనే సరిపోందని, ఆ కుటుంబాల తలసరి ఆదాయం పెరగాలన్నారు. భవిష్యత్‌లో దీనిని పరిశీలించడం జరగుతుందని చంద్రబాబు చెప్పారు.

కూతురు, చెల్లిని చదివించాలి : నజీరున్

మాచర్లకు చెందిన షేక్ నజీరున్‌ను మరో బంగారు కుటుంబంగా ఎంపిక చేశారు. ఈమె తను పడుతున్న కష్టాలను చంద్రబాబుకు విన్నవించింది. తన భర్త చనిపోయాడని, కుతురు ఉందని.. కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నానని పేర్కొంది. తనకు చెల్లి ఉంది. కుతురుతో పాటు తన చెల్లిని చదివించే బాధ్యత తనపై ఉందని చెప్పుకొచ్చింది. తల్లి ఇటీవలే మరణించిందని, తండ్రికి అనారోగ్యంతో ఉన్నారని.. కూతురు, చెల్లి ఇద్దరు డిగ్రీ చదువుతున్నారని.. ఇద్దరి చదువుకు సాయం అందించాలని కోరింది. నజీరున్ బంగారు కుటుంబాన్ని దుర్తికి చెందిన విత్తన కంపెనీ యజమాని యాగంటి వెంకటేశ్వర్లు మార్గదర్శిగా నిలిచారు. ఆ ఇద్దరి చదువుకు సాయం అందిస్తానని వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ ఇద్దరు ఎంత వరకు చదువుతారో చదివించి వారిని సెటిల్ చేయాలని చంద్రబాబు సూచించారు. ఇలాంటి వారిని అదుకుని అభివృద్ధిలోకి తీసుకురావడమే పీ-4 లక్ష్యం అని చంద్రబాబు తెలిపారు. ఈ కుటుంబాన్ని దత్తత తీసుకున్న వెంకటేశ్వర్లును అభినందించారు. అమె తండ్రికి పింఛన్‌కు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతులుగా ఉండాలి

బల్లికురవ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించటం ద్వారా ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని ఎంపీడీవో కుసుమ కుమారి చెప్పారు. మండలంలోని అంబడిపూడి గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను ఎంపీడీవో పరిశీలించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి స్వప్న, హెచ్‌ఎం లింగారావు, ఉపాధ్యాయులు వీరాంజనేయులు పాల్గొన్నారు.

శింగరకొండలో హుండీల ద్వారా రూ.5.35 లక్షలు

అద్దంకి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలోని హుండీల కానుకలను శనివారం లెక్కించారు. 2025 మార్చి 15వ తేదీ నుంచి శనివారం వరకు హుండీల ద్వారా 5,35,165 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. దేవదాయశాఖ అద్దంకి డివిజన్ పరిశీలకులు వెంకటేశ్వరరావు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఈవో మద్దినేని శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

అందరి సహకారంతో క్లీన్ అండ్ గ్రీన్ అద్దంకి

అద్దంకి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : అందరి సహకారంతో క్లీన్ అండ్ గ్రీన్ అద్దంకిగా మారుస్తామని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కోర్టు భవనాల సముదాయం వద్ద పబ్లిక్ టాయిలెట్స్‌ను శుభ్రం చేయించారు. పాత తహసీల్దార్ కార్యాలయం, హౌసింగ్ కార్యాలయం వద్ద స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ రవీంద్రలు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి, హౌసింగ్ ఏఈ కిరణ్ పాల్గొన్నారు.

పంగులూరులో...

పంగులూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి పెంచాలని ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ వి.సింగారావు కోరారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని స్థానిక ఉన్నత పాఠశాల, మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణాలలో నిర్వహించారు. తొలుత ర్యాలీచేపట్టారు. మొక్కలు నాట్టారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ బాలరాజేశ్వరి, డిప్యూటీ ఎంపీడీవో సుమంత్, ఎంఈవో వీరాంజనేయులు, ఏవో సుబ్బారెడ్డి, హౌసింగ్ ఏఈ కిషోర్‌కుమార్, ఏపీఎం సంతోషం, హెచ్‌ఎం శ్రీనివాసరావు, కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

చినగంజాంలో...

చినగంజాం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్మించారు. హెచ్‌ఎం కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, పూర్వ ఎన్‌సీసీ అధికారి ఎస్.నరసింహారావు, ఏసీసీ అధికారి సుబ్బారావు, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయులు రామకోటిరెడ్డి, జ్యోతి, పీడీ గంటా అంకమ్మ, కృష్ణారావు పాల్గొన్నారు. చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు ఆధ్వర్యంలో అధికారులు గ్రామ పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు స్వరాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీని సచివాలయం-2 వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు.



అద్దంకిలోని రాజీవ్‌కాలనీ సమీపంలో మొక్కలను నాటుతున్న డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు


పంగులూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు

వీర్ల చెరువుకు జలకళ

బల్లికురవ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీర్ల చెరువు ఒక్క రాత్రి కురిసిన భారీ వర్షానికి నీటితో కళకళలాడుతోంది. బల్లికురవ, నక్కబొక్కలపాడు గ్రామాలలో ఉన్న పంట భూములకు నీటిని అందించే ఈ చెరువు కొన్ని నెలల నుంచికళావిహీనంగా ఉంది. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరద ఉధృతిగా రావటంతో చెరువుకు నీరు పుష్కలంగా చేరుతోంది. దీంతో చెరువు కింద ఆయకట్టులో ఉన్న రెండు గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 350 ఎకరాల విస్తీర్ణం ఉన్న చెరువుకు నీరు నిండుగా చేరిందని ఈ ఏడాది వరి, ఇతర పంటల సాగుకు ఎలాంటి ఢోకా లేదని చెబుతున్నారు. చెరువులో ఉన్న చేపలు బయటకు వెళుతుండడంతో చేపలు పెంచుతున్న కాంట్రాక్టర్ వెంటనే చెరువుకు నలువైపులా కూలీలతో వలలను ఏర్పాటు చేయించారు.


నిండు కుండలా ఉన్న వీర్ల చెరువు

కారు ఢీకొని అన్న మృతి.. తమ్ముడికి గాయాలు

స్వర్ణ రోడ్డులో ప్రమాదం



అపస్మారక స్థితిలో శేఖర్‌బాబు



శ్రీనివాసరావు(ఫైల్)

చీరాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఓ శుభకార్యానికి చీరాల వచ్చి తిరిగి వెళుతున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్న అక్కడికక్కడే మృతి చెందగా, తమ్ముడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కారంచేడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జె పంగులూరు మండలం ఆరికట్లవారిపాలేనికి చెందిన కొమరబత్తిన శ్రీనివాసరావు(50), శేఖర్‌బాబు అన్నదమ్ములు. ఇద్దరు వ్యవసాయ కూలీలు. శనివారం చీరాల పట్టణంలో బంధువుల శుభకార్యక్రమానికి ద్విచక్ర వాహనంపై వచ్చారు. సాయంత్రం తిరిగి స్వర్ణ రోడ్డులో వెళుతుండగా మార్గమధ్యలోని టపాసుల ఫ్యాక్టరీ సమీపంలో ఎదురుగా వస్తున్న ఓ కారు వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో అన్న శ్రీనివాసరావు అక్కడికక్కడే మతి చెందగా, తమ్ముడు అపస్మారక స్థితిలోకి చేరాడు.స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనపై కారంచేడు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ఒక రోజు ముందే చీరాల సమీపంలో కారు ఢీకొని ఒకరు మృతిచెందిన విషయం పాఠకులకు విదితమే. వరుస ఘటనలతో ప్రజలు భీతిల్లుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మార్టూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : స్థానికంగా కొణిదెన రోడ్‌లో మద్యం షాపులు దాటిన తర్వాత రోడ్డు సమీపంలోని తుమ్మచెట్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉంది. ఆ మేరకు శనివారం సమాచారం వచ్చినట్లు ఏఎస్‌ఐ బాషా తెలిపారు. ఆయన కథనం ప్రకారం... మృతుడికి 45 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉంటాయన్నారు. మృతుని పక్కనే ఖాళీ మద్యం సీసా, గడ్డిమందు డబ్బా ఉన్నట్లు గుర్తించామన్నారు. మృతుడు మద్యంలో గడ్డిమందు తాగి మృతి చెందినట్లుగా భావిస్తున్నట్లు చెప్పారు. ఒంటిపై తెల్లని చొక్కా, నల్ల ప్యాంట్ ఉన్నాయన్నారు. వీఆర్‌వో మోహనరావు ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ బాషా తెలిపారు.

కోటపాడు పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు

పంగులూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలకు చందలూరుకు చెందిన అజిత్‌కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ రెండు సీసీ కెమెరాలను బహూకరించారు. వీరనారాయణకు ఎస్‌ఎంసీ చైర్మన్ బుల్లిబాబు, హెచ్‌ఎం వేణుబాబు, కట్టా శ్రీనివాసరావులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్‌డ్యూటీలోనే...

చీరాల పోలీస సబ్ డివిజన్ పరిధిలో సిబ్బంది కొరత.. ఆపై బయట ప్రాంతాల్లో విధులకు..



తిరుపతి బ్రహ్మోత్సవాలకు, అసెంబ్లీ విధులకు రక్షక భటులు

సమస్యల పరిష్కారానికి బాధితుల పడిగాపులు

చీరాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చీరాల సబ్ డివిజన్ పరిధిలో పోలీస్ స్టేషనలో సిబ్బంది కొరత వేధిస్తోంది. బయట ప్రాంతాల విధులకు కేటాయిస్తుండడంతో సమస్య జటిలంగా మారుతోంది. సబ్‌డివిజన్ పరిధిలో ఒక డీఎస్పీ, ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్సైలు ఉన్నారు. వారితో పాటు సుమారు 350 - 400 వరకు కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఇతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో సుమారు 100 మందికి పైగా ప్రస్తుతం సెలవుల్లో ఉన్నారు. ప్రతి స్టేషన్‌కు సుమారు 50 మంది ఉండగా.. వీరిలో సెలవుల్లో ఉన్నవారు, రికార్డు వర్క్‌లు, దర్యాప్తు, ట్రాఫిక్ వగైరాతో పోల్చుకుంటే ముప్పావు భాగం బయటకు వెళ్తున్నారు. దీంతో స్టేషన్లను ఆశ్రయించిన ఫిర్యాదుదారులు న్యాయ పరిష్కారంలో జాప్యంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే ఈనెల 24నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు నలుగురు ఎస్సైలు, 12 మంది సిబ్బంది విధులకు హాజరు కానున్నారు. అలాగే అసెంబ్లీ సమావేశాలకు సంబంధించిన విధులకు సుమారు 70 మంది పోలీసులు తరలి వెళ్లనున్నారు.

- చీరాల ఒకటో పట్టణ పరిధిలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, కూరగాయల మార్కెట్, ముంతావారి సెంటర్ నిత్యం ప్రజలు, వాహనదారులతో రహదారులు రద్దీగా ఉంటాయి. ఈక్రమంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుంటాయి. అలాగే వాహనాలు చోరీలతో పాటు, రోడ్డు ప్రమాదాల వివాదాలు అధికమే. అలాగే చీరాల చుట్టుపక్కల ఎక్కడ సమస్య జరిగినా సంబంధిత కుటుంబ సభ్యులు, మద్దతుదారులు, లేదా పార్టీలు, వ్యక్తులు గడియార స్తంభం కూడలిలోనే ధర్నాలు చేస్తుంటారు.
- అలాగే రెండో పట్టణ పరిధిలో ఒక ఎస్‌హెచ్‌వో, ఇద్దరు ఎస్సైలు ఉండగా సుమారు 50 మంది సిబ్బంది ఉన్నారు. ఇక్కడ పేరాల, జయంతిపేట, జాన్‌పేట, ఐక్యనగర్, కొత్తపేట రోశయ్య నగర్, ఐఎల్‌టీడీ కాలనీతోపాటు శృంగారపేట, రామనగర్, ఆదినారాయణపురం వంటి ప్రాంతాలు స్టేషన్ పరిధిలో ఉన్నాయి. వీటిల్లో కొన్ని ప్రాంతాల్లో నాటుసారా, కొట్లాట కేసులతోనే పోలీసులు తలమునకలవుతుంటారు. ఈక్రమంలో చాలీచాలని సిబ్బందితో పోలీసులు రోజులు గడుపుతున్నారు. అలాగే చీరాల రూరల్ పరిధిలో ఈపూరుపాలెం, వేటపాలెం స్టేషన్లు పేరుకు చిన్నవే అయినా లా అండ్ ఆర్డర్ సమస్యలు అధికం. నిత్యం సివిల్, క్రిమినల్ కేసులు వస్తుంటాయి. అక్రమ ఇసుక రవాణా, జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాలు అధికమే. అంతేకాకుండా ఈ రెండు స్టేషన్లకు ప్రొటోకాల్ డ్యూటీలు కోకొల్లలు.
- అంతేకాకుండా సబ్ డివిజన్ పరిధిలో అద్దంకి, మేదరమెట్ల, కొరిశపాడు, పంగులూరు, ఇంకొల్లు, చినగంజాం, కారంచేడు స్టేషన్‌లు ఉన్నాయి. ఈ విధంగా పరిశీలిస్తే వచ్చే 15 రోజుల్లో స్టేషన్‌లో పది మంది సిబ్బంది ఉండటం అతికష్టమే అనిపిస్తోంది. ఇప్పటికే సిబ్బంది కొరతతో స్టేషన్లను ఆశ్రయిస్తున్న ఫిర్యాదుదారులు తలలు పట్టుకుంటున్నారు. పరిష్కారాల కోసం రోజులు, రోజులు స్టేషన్ల వద్ద ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పుడు అదనపు డ్యూటీ కారణంగా నేరగాళ్లకు కలిసొచ్చే కాలం అన్న చందంగా ఉంది. ఈక్రమంలో అవసరం మేరకు సిబ్బందిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని బాధితులు కోరుతున్నారు.

రైతుల వద్దకు రెవెన్యూ సేవలు

మంత్రి రవికుమార్ ఆదేశాలతో అన్ని గ్రామాలలో అధికారుల సమావేశాలు

గ్రామాల్లోనే సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ వెల్లడి



నక్కబొక్కలపాడులో రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ రవినాయక్

బల్లికురవ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ఎంతో కాలంగా ఉన్న రెవెన్యూ సమస్యలను ప్రజల వద్దకే వెళ్లి పరిష్కరించేందుకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ రవినాయక్ చెప్పారు. పలు గ్రామాలలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని రైతులు మంత్రి రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. మంత్రి వెంటనే స్పందించి అన్ని గ్రామాలలో సమావేశాలు పెట్టాలని ఆదేశించారు. దీంతో శనివారం నక్కబొక్కలపాడు గ్రామంలో తహసీల్దార్ రవినాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 17 మంది రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎవరు కార్యాలయాల చుట్టూ తిరగవద్దని తహసీల్దార్ చెప్పారు. అన్ని గ్రామాలలో ఈసమావేశాలు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చెప్పారు. శనివారం పర్చూరు ప్రభుత్వ పాఠశాలలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌తో కలసి ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా డీపీవో ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల సేవలకు విలువ కట్టలేని వన్నారు. కోడి కూతకూయకముందే గ్రామాల్లోని చెత్తా చెదారాన్ని శుభ్రంచేసి అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు.

ప్లాస్టిక్ రహిత జిల్లానే లక్ష్యం : కలెక్టర్ వినోద్ కుమార్

స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా బాపట్లను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దటమే తన ముందున్న లక్ష్యమని, దీనికి ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ వినోద్ కుమార్ కోరారు. స్వచ్ఛత ప్రతి రంగంలోనూ ఉండాలన్నారు. అన్ని జిల్లా కార్యాలయాలు, మండల కార్యాలయాలను స్వచ్ఛ కార్యాలయాలుగా తీర్చిదిద్దాలని చెప్పారు. ఇంటా బయట స్వచ్ఛంగా ఉండాలన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించినప్పుడే ఇలాంటి ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమం సంపూర్ణంగా నెరవేరుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆహ్లాదకరమైన ప్లాంటేషన్ జరగాలని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న గ్రీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం పర్చూరులో చేపట్టామన్నారు. జిల్లా సామాజిక అటవీశాఖ ద్వారా ఖాళీగా ఉన్న ప్రతి చోట మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గ్లోరియా, డీఎంహెచ్‌వో విజయమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న, ఎంఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు పాల్గొన్నారు.

మూడు రోజులుగా వర్షం జల్లులు

పగలు ఎండ... సాయంత్రం వర్షం



అద్దంకిలో కురుస్తున్న వర్షం

అద్దంకి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా అద్దంకిలో పగలు ఎండలు కాస్తుండగా, సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయి వర్షపు జల్లులు పడుతున్నాయి. గురు, శుక్రవారాలలో భారీ వర్షాలు కురవగా, శనివారం సాయంత్రం కూడా వర్షపు జల్లులు పడ్డాయి. చిన్నపాటి వర్షానికే పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి.

బల్లికురవలో దంచి కొట్టిన భారీ వర్షం

బల్లికురవ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో శనివారం వర్షం దంచి కొట్టింది. గంటపాటు ఉరుములు, మెరుపులు గాలులతో భారీ వర్షం కురవటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోకి వర్షం నీరు పెద్ద ఎత్తున చేరింది. శుక్రవారం రాత్రి కూడా భారీ వర్షం పడింది. వరుసగా రెండురోజులపాటు వర్షాలు పడటంతో వీధులన్నీ నీటితో నిండిపోయాయి. ఈ ఏడాదికి ఇంత పెద్ద వర్షం ఎప్పుడూ కురవలేదని ప్రజలు అంటున్నారు. ఈ వర్షం మెట్ట పంటలకు ఎంతో ఉపయోగం అని రైతులు చెబుతున్నారు. ముక్తేశ్వరం గ్రామంలో మురుగు కాలువలు సరిగా లేక రోడ్డుపై మురుగు నీరు పారింది. వర్షం తగ్గాక గ్రామాలలో పారిశుధ్య పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

టిడ్కో ఇళ్ల వద్ద జంగిల్ క్లియరెన్స్ ప్రారంభం

అద్దంకి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణ సమీపంలోని అద్దంకి కొండ వద్ద అసంపూర్తిగా పనులు నిలిచిపోయిన టిడ్కో ఇళ్ల పరిసరాలలో పెరిగిన చిల్లచెట్లు, జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభమయ్యాయి. మొదటగా పరిసరాలను మొత్తం శుభ్రం చేయించనున్నారు. సుమారు ఆరున్నరేళ్లుగా నిలిచిపోయిన టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించేందుకు ముందస్తుగా ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. చిల్లచెట్లు తొలగింపు పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ రవీంద్ర పరిశీలించారు.



పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్ర

అవీఇవీ

ప్రత్యేక ఆకర్షణగా చిన్నారుల దేవతామూర్తుల వేషధారణలు



దేవతామూర్తుల వేషధారణలో విద్యార్థులు

అద్దంకి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని భవానీ సెంటర్‌లో ఉన్న ఎల్‌ఆర్ ఎయిడెడ్ స్కూలులో శనివారం ముందస్తు దసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు దేవతామూర్తుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తమ పిల్లల వేషధారణలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు.

అటవీ శాఖ తరఫున మొక్కల పంపిణీ



మొక్కలను పంపిణీ చేస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్

మార్టూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అటవీశాఖ తరఫున ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తామని కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె. రమేష్ చెప్పారు. ఆయన శనివారం మండల పరిధిలోని బొబ్బేపల్లి రిజర్వ్ ఫారెస్ట్ కొండ దగ్గర ఉపాధి హామీ పథకం ద్వారా నర్సరీలో పెంచుతున్న మొక్కలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 40 వేల మొక్కలైన జామ, సీతాఫలం, ఉసిరి, బాదం, వేప, కానుగ, పనస, చింత, వెదురు తదితర మొక్కలను నర్సరీలో పెంచామన్నారు. ఈ మొక్కలలో 10 మొక్కలు అవసరమైన వారు ఆధార్ కార్డుతో, లేదా ఎక్కువ మొక్కలు అవసరమైన వారు ఎంపీడీవో ద్వారా లెటరు తీసుకొని వచ్చి మొక్కలను పొందవచ్చన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు వీరాంజనేయులుకు సత్కారం



వీరాంజనేయులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

బల్లికురవ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కొప్పెరపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు గాలం వీరాంజనేయులను శనివారం పలువురు సత్కరించారు. బల్లికురవ ఎంఆర్‌సీలో జరిగిన కాంప్లెక్సు సమావేశం సందర్భంగా ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వీరాంజనేయులను పలు పాఠశాలలకు చెందిన టీచర్లను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ నోడల్ చైర్మన్ లింగారావు, డేవిడ్‌పాల్, ప్రధానోపాధ్యాయులు మన్నెం హరిబాబు, కోటినాగులు, దూళిపాళ్ల శేషగిరి, సంపతి శ్రీనివాసరావు, చింతల రామకృష్ణ, అచ్యుత్‌మోహన్ పాల్గొన్నారు.

ట్రంప్ టారిఫ్‌తో పరిశ్రమలు మూతపడే అవకాశం

మార్టూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన టారిఫ్ కారణంగా మార్టూరు, చిలకలూరిపేట పరిధిలోని స్పిన్నింగ్ మిల్లులు మూతపడి కార్మికులు రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి చెప్పారు. శనివారం ఆమె మార్టూరులోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం పరిశ్రమలకు ఇవ్వాల్సిన రాయితీలు సక్రమంగా మంజూరు చేయకపోవడంతో నిర్వహణ కష్టతరమైందన్నారు. గ్రానైట్ పరిశ్రమల నిర్వహణలో సబ్సిడీ రాయితీలు రాకపోవడం, ధరలేకపోవడం, అమ్మకాలు లేకపోవడంతో పరిశ్రమలలో కార్మికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులను గుర్తించాలని, వారికి అన్నివిధాలా ప్రభుత్వపరంగా సహాయ సహకారాలను అందించాలని, అన్ని పరిశ్రమలు సక్రమంగా సాగేవిధంగా ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ గంగయ్య, బత్తుల హనుమంతరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పరిమళించిన మానవత్వం



గోమాతకు సపర్యలు చేస్తున్న విద్యార్థులు

చీరాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో మానవత్వం పరిమళించింది. శనివారం సాయంత్రం చీరాల ఏరియా వైద్యశాల సమీపంలో ఓ గోమాత రోడ్డు వెంబడి ఫెన్సింగ్ వేసి ఉన్న చెట్ల ఆకులు తినేందుకు వెళ్లింది.ఆక్రమంలో ప్రమాదవశాత్తు కుడికాలు ఫెన్సింగ్ తీగల్లో చిక్కుకుని అల్లాడుతుంది. అదే సమయంలో కళాశాల నుంచి ఇంటికి వెళుతున్న గౌతమీ విద్యాసంస్థల విద్యార్థులు ఆ గోమాత దీనస్థితిని గమనించారు. అక్కడికి వెళ్లి గోమాత కాలును ఇనుప తీగల నుంచి బయటకు జాగ్రత్తగా తీశారు. రక్త గాయం కావడంతో కట్టుకట్టి సపర్యలు చేయడంతో ప్రజలు వారి సేవను హర్షిస్తున్నారు.

మెగా డీఎస్సీలో పీడీ పోస్టుకు ఎంపికైన వారికి సత్కారం



ఎంపికైన వారిని సత్కరిస్తున్న రాష్ట్రఅసోసియేషన్ ప్రతినిధులు

పంగులూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మెగా డీఎస్సీలో క్రీడలలో ప్రతిభ చాటిన వందలాదిమందిని స్పోర్ట్స్ కోటాలో వ్యాయామోపాధ్యాయులు(పీడీలు)గా ఎంపిక చేయడం అభినందనీయమని కేకేఎఫ్ఐ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి సీతారామిరెడ్డి చెప్పారు. 2023లో గోవాలో నిర్వహించిన జాతీయ క్రీడలపోటీలలో పాల్గొని బ్రాంజ్‌మెడల్ సాధించిన రాష్ట్రఖోఖో జట్టు క్రీడాకారులు 11మందికి రాష్ట్రప్రభుత్వం పోటీ పరీక్షతో నిమిత్తం లేకుండా పీడీ పోస్టులకు ఎంపిక చేసింది. ఖోఖో క్రీడలో ప్రతిభచాటిన క్రీడాకారులను గుర్తించి క్రీడలకోటాలో మెగా డీఎస్సీలో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కొనియాడుతూ పంగులూరులో శనివారం సాయంత్రం అభినందనసభ నిర్వహించారు. ఎంపికయిన 11మంది క్రీడాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రావూరి రమేష్, ఆర్‌వీ సుబ్బారావు,కుర్రా వెంకటరావు పాల్గొన్నారు.